
జాతీయ దినపత్రిక
Postail Licence No. L/KNL/3-52(D) 2018 - 2020
# ఉదయం న్యూస్
ఎడిటర్ : సి. శేఖర్ యం
Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi
సంపుటి :04 | సంచిక :105 | పేజీలు 8 | వెల : 5 | శుక్రవారం 17 అక్టోబర్ 2025





## శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న ప్రధాని మోదీ

శ్రీశైలం ఆలయం: కర్నూలు పర్యటనకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ శ్రీశైలం క్షేత్రాన్ని దర్శించుకున్నారు. అర్చకులు, ఆలయ అధికారులు ఆయనకు లాంఛనంగా స్వాగతం పలికారు. భ్రమరాంబ, మల్లికార్జున స్వామివారికి మోదీ పూజలు చేశారు. మల్లికార్జునస్వామికి పంచామృతాలలో రుద్రాభిషేకం, భ్రమరాంబదేవికి ఖడ్గమాల, కుంకుమార్చన పూజలు చేశారు. పూజల అనంతరం శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించనున్నారు. ఇక్కడి శివాజీ దర్బార్ హాల్, ధ్యాన మందిరాలను తిలకించనున్నారు. ప్రధానితో పాటు ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శ్రీశైలం చేరుకున్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.





- ఓకల్ ఫర్ లోకల్ నినాదంతో సాగాలి
- డ్రోన్ టెక్నాలజీలో కర్నూలుకు స్థానం
- ఆవిష్కరణలకు కేంద్రంగా ఆంధ్రప్రదేశం
- గూగుల్ రాకతో విశాఖ దశ మారతుంది
- రాష్ట్రంలో చంద్రబాబు, పవన్‌ల విజనరీ నాయకత్వం
- కర్నూలు సభలో ప్రధాని మోదీ ప్రసంగం

## ప్రధాని కర్నూలు సభ
# 'సూపర్' సక్సెస్..

2047 నాటికి భారతదేశం ప్రపంచంలో అగ్రస్థానంలో ఉంటుందని తెలిపారు చంద్రబాబు అన్నారు. మరోవైపు.. ఆపరేషన్ సిందూర్ ప్రపంచానికి మన సైనిక బలాన్ని నిరూపించింది. మాటలతో కాదు.. చేతలతో చూపించే వ్యక్తి ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. జీఎస్టీ తగ్గింపుతో ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.10 వేలు ఆదా అవుతుందని వెల్లడించారు. సరైన సమయంలో ప్రధాని మోడీ.. దేశానికి సరైన నాయకుడిగా ఉన్నారని ప్రశంసలు కురిపించిన ఆయన.. ఇలాంటి నాయకుడు ఉండటం దేశం అదృష్టంగా అభివర్ణించారు.. చాలా మంది ప్రధానమంత్రులతో కలిసి పనిచేశారు..

కర్నూలు: జీఎస్టీ సంస్కరణలతో పేదలకు మేలు జరుగుతోందని, అయితే అది ఓకల్ ఫర్ లోకల్ కావాలని ప్రధాని మోడీ అభిలషించారు. డ్రోన్ టెక్నాలజీకి కర్నూలు కేంద్రం కాబోతోందన్నారు.

మరోవైపు.. ఆపరేషన్ సిందూర్ ప్రపంచానికి మన సైనిక బలాన్ని నిరూపించింది. అందులో దేశీయ టెక్నాలజీ అద్భుతంగా పనిచేసిందన్నారు. ఇది మన ఆత్మనిర్భరతకు గర్వకారణమన్నారు. కర్నూలు శివారులోని నన్నూరు వద్ద 'సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్' పేరుతో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు సీఎం చంద్రబాబు, గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నారా లోకేశ్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల నిర్మించిన, నిర్మించబోతున్న రూ.13,429 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. ఆత్మగౌరవం, సంస్కృతికి నిలయంగా ఆంధ్రప్రదేశ్ ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సైన్స్, ఆవిష్కరణల కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ ఉంది. ఏపీలో అనంత అవకాశాలతో పాటు యువతకు అపార శక్తి ఉంది. అహోబిలం నర్సింహస్వామి, మహానంది ఈశ్వరుడికి నమస్కరిస్తున్నా. మంత్రాలయం రాఘవేంద్రస్వామి అందరినీ ఆశీర్వదించాలని కోరుతున్నా. జ్యోతిర్లింగం సోమనాథుడి నేల అయిన గుజరాత్‌లో నేను జన్మించాను. విశ్వనాథుడి భూమి అయిన కాశీకి సేవ చేసే అవకాశం లభించింది. ఇవాళ శ్రీశైలం మల్లికార్జునస్వామి ఆశీస్సులు పొందానని అన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ రూపంలో ఏపీకి శక్తిమంతమైన నాయకత్వం ఉంది. ఏపీకి కేంద్ర ప్రభుత్వం పూర్తి మద్దతు ఉంది. 16 నెలలుగా రాష్ట్రంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోంది. డబుల్ ఇంజిన్ సర్కారు ఆధ్వర్యంలో రాష్ట్రం అపూర్వ ప్రగతి సాధిస్తోంది. దిల్లీ, అమరావతి వేగంగా అభివృద్ధి పథంలో సాగుతున్నాయి. 2047 నాటికి మన దేశం.. వికసిత్ భారత్‌గా మారుతుంది. 21వ శతాబ్దం.. 140 కోట్ల భారతీయుల శతాబ్దం అని ప్రధాని మోదీ అన్నారు. ప్రాజెక్టుల వల్ల రాష్ట్రంలో కనెక్టివిటీ బలోపేతం అవుతుంది. ప్రాజెక్టులతో పరిశ్రమలకు ఊతంతో పాటు జీవన ప్రమాణాలు మెరుగవుతాయి. ఏ దేశమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే ఇంధన భద్రత కీలకం. ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులతో దేశం ఇంధన సామర్థ్యం పెరుగుతుంది. గూగుల్ ఏఐ డేటా సెంటర్ ద్వారా సబ్ సీ గేట్‌వేగా ఏపీ మారుతుంది. ఈ ప్రాజెక్టు విశాఖను ఏఐ, కనెక్టివిటీ హబ్‌గా మారుస్తుంది. దీని ద్వారా భారత్‌తో పాటు యావత్ ప్రపంచానికి సేవలు అందుతాయి. భారత్ అభివృద్ధికి ఏపీ అభివృద్ధి చాలా అవసరం. అలాగే ఏపీ అభివృద్ధికి.. రాయలసీమ అభివృద్ధి అంతే అవసరం. ఈ ప్రాజెక్టులు రాయలసీమ లోని ప్రతి జిల్లాలో ఉద్యోగాలు సృష్టిస్తాయి. రాయలసీమ ప్రగతికి సరికొత్త ద్వారాలు తెరిపిస్తాయి. ప్రాజెక్టులతో పారిశ్రామిక అభివృద్ధి మరింత వేగవంతమవుతుంది. ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక కారిడార్లతో ఉపాధి అవకాశాలు పెరిగాయి. భారత్‌ను 21వ శతాబ్దపు తయారీ కేంద్రంగా ప్రపంచం చూస్తోంది. ఆత్మనిర్భర్ భారత్ సాధనకు ఆంధ్రప్రదేశ్ కీలకంగా మారనుంది. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏపీ సామర్థ్యాన్ని విస్మరించాయి. దేశాన్ని ముందుకు నడిపించే శక్తి ఏపీకి ఉంది. ఎన్‌డీఏ హయాంలో ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రం మారుతోందని ప్రధాని అన్నారు. ప్రాజెక్టుల వల్ల రాష్ట్రంలో కనెక్టివిటీ బలోపేతం అవుతుందని.. ప్రాజెక్టులతో పరిశ్రమలకు ఊతంతో పాటు జీవన ప్రమాణాలు మెరుగవుతాయని వెల్లడించారు. ఏ దేశమైనా.. రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే ఇంధన భద్రత కీలకం అన్నారు ప్రధాని నరేంద్ర మోడీ.. ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులతో దేశం ఇంధన సామర్థ్యం పెరుగుతుందన్న ఆయన గూగుల్ ఏఐ డేటా సెంటర్ ద్వారా సబ్ సీ గేట్‌వేగా ఆంధ్రప్రదేశ్ మారుతుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

**సూపర్ జీఎస్టీ ..**
- సూపర్ సేవింగ్స్ ప్రారంభం మాత్రమే
- 21వ శతాబ్దం మోడీదే అవుతుందనడంలో సందేహం లేదు
- మోడీలాంటి నేత ఉండడం మన అదృష్టం
- కర్నూలు సభలో సిఎం చంద్రబాబు ప్రశంసలు



## మావోయిస్టులకు వరుస ఎదురుదెబ్బలు

ఛత్తీస్‌ఘడ్‌లో లొంగిన 170మంది మావోలు
లొంగిన వారిలో వాసుదేవరావు తదితరులు
ఎక్స్ వేదికగా వెల్లడించిన హోంమంత్రి అమిత్ షా



## వ్యూస్, లైక్స్‌తో సోషల్ మీడియాలో ఫేమస్

వ్యూస్ మాయలో విలువలు మరిచిపోతే ఎలా ?
చిన్నారుల భవిష్యత్‌ను పణంగా పెట్టడం సమంజసమా
చిన్నారులతో అసభ్యకరమైన కంటెంట్ ఉంటే నేరం
ఇలాంటి వాటిని తొలగించండి..భవిష్యత్‌లో పెట్టకండి
లేదంటే చట్టప్రకారం చర్యలు తప్పవని సిపి సజ్జనార్ హెచ్చరిక



## బిసి రిజర్వేషన్లపై వెనక్కి తగ్గేది లేదు

న్యాయనిపుణులతో చర్చించి ముందుకు
స్థానిక ఎన్నికల్లో ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తివేత
కొత్తగా మూడు వ్యవసాయ కళాశాలు మంజూరు
మెట్రో రెండో దశపై సిఎస్ ఆధ్వర్యంలో కేబినేట్ సబ్‌కమిటీ
డిసెంబరు 1 నుంచి 9 వరకు ప్రజాపాలన విజయోత్సవాలు
తెలంగాణ కేబినేట్ భేటీలో కీలక నిర్ణయలు...
హాజరు కాని కొండా సురేఖ



## జూబ్లీహిల్స్‌లో బోగస్ ఓట్లపై విచారణ

ఇప్పుడు ఇసికి ఆదేశాలు ఇవ్వలేమన్న హైకోర్టు

డబుల్, ట్రిపుల్ ఎంట్రీలతో ఓటరు జాబితాలో ఒకే ఫొటో భిన్నంగా కనిపిస్తోంది. అంటే ఫొటోను తీక్షణంగా చూస్తే తప్ప గుర్తుపట్టలేని స్థితి. సీరియల్ నంబరు వేరుగా ఉండడంతో పోలింగ్ రోజున డబుల్ ఎంట్రీల ఓట్లను ఇతర వ్యక్తులతో వేయించే అవకాశముంది. ఇతర నియోజకవర్గాల వారికి ఓటు హక్కు కల్పించడంతో వారు కూడా ఇక్కడ ఓటేసే వీలుంది. ఇవన్నీ ఇటీవల నమోదు చేసుకున్నవే కావడం గమనార్హం. ఖైరతాబాద్, సనత్‌నగర్, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల వారి పేర్లను భారీగా చేర్పించారు. దీంతో ఒకే ఇంటి నంబరుపై దాదాపు 49 ఓట్లున్న విషయం వెలుగు చూసింది. కృష్ణానగర్‌లోని ఒక గ్రూప్ హౌస్‌లో 23 మంది ఉంటే 49 ఓట్లు నమోదయ్యాయి.




## బిసి రిజర్వేషన్లపై ప్రభుత్వానికి దక్కని ఊరట

స్పెషల్ లీవ్ పిటిషన్‌పై విచారణకు సుప్రీం తిరస్కరణ
పాత పద్దతిలోనే ఎన్నికలకు వెళ్లాలని సూచన
హైకోర్టు విచారణపై జోక్యం చేసుకోలేమన్న ధర్మాసనం
50శాతం మించి రిజర్వేషన్లను ఆమోదించలేమని వ్యాఖ్య
ప్రభుత్వం తదుపరి కార్యాచరణపై ఉత్కంఠ

50 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లండని ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. పాత రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో సంబంధం లేకుండా తదుపరి విచారణ చేపట్టాలని ధర్మాసనం హైకోర్టుకు సూచించింది. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున విచారణకు స్వీకరించలేమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తమ ఆదేశాలతో సంబంధం లేకుండా తదుపరి విచారణ చేపట్టాలని.. మెరిట్స్ ప్రకారం విచారించాలని హైకోర్టుకు సూచించింది.

# మావోయిస్టులకు వరుస ఎదురుదెబ్బలు

న్యూఢిల్లీ: మావోయిస్టులకు వరుసగా భారీ ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. మావోయిస్టు పార్టీకి దశాబ్దాలపాటు అత్యంత కీలక నేతగా వ్యవహరించిన మల్లోజుల వేణుగోపాల్‌రావు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ ముందు లొంగిపోయిన మరుసటి రోజే మరో 170 మంది మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయారు. ఈ విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. 2026 మార్చి 31 నాటికి నక్సలిజాన్ని సమూలంగా నిర్మూలించేందుకు తాము కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో సుదీర్ఘ పోస్టు పెట్టారు. నిన్న ఛత్తీస్‌గఢ్‌లో 27మంది; మహారాష్ట్రలో 61 మంది జనజీవన స్రవంతిలోకి వచ్చారన్నారు. దీంతో రెండు రోజుల వ్యవధిలో 258 మంది లొంగిపోయారన్న అమిత్ షా.. నక్సలిజంపై పోరులో ఇదో పెద్ద విజయమన్నారు. భారత రాజ్యాంగంపై తమ విశ్వాసాన్ని ప్రకటిస్తూ హింసను త్యజించాలనే వీరి నిర్ణయాన్ని అభినందిస్తున్నట్లు అమిత్ షా తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం వామపక్ష తీవ్రవాదాన్ని అంతం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాల ఫలితాలను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. తమ విధానం స్పష్టంగా ఉందన్న అమిత్ షా.. లొంగిపోయేవారిని స్వాగతిస్తామని.. ఇంకా తుపాకీతో ఉద్యమం కొనసాగించాలను కొనేవారు భద్రతా దళాల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. నక్సలిజం మార్గంలో ఇంకా కొనసాగుతున్న వారు ఆయుధాలను విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో చేరాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. ఒకప్పుడు వామపక్ష తీవ్రవాద స్థావరాలుగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్, ఉత్తర బస్తర్‌లు విముక్తిపొందిన ప్రాంతాలుగా ప్రకటించడం సంతోషదాయకమని తెలిపారు. ఇప్పుడు దక్షిణ బస్తర్‌లో నక్సలిజం జాడ ఉందని.. దీన్ని భద్రతా దళాలు త్వరలో తుడిచిపెడతాయని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో భాజపా సర్కార్ ఏర్పాడిన తర్వాత జనవరి 2024 నుంచి 2,100 మంది మావోయిస్టులు లొంగిపోగా, 1785మందిని అరెస్టు చేశారని తెలిపారు. 477 మందిని భద్రతాదళాలు నిర్మూలించాయని తెలిపారు.

లొంగిపోయిన వారిలో సతీష్ అలియాస్ టి. వాసుదేవరావు సహా 10 మంది సీనియర్ మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం. లొంగిపోయిన వారి జాబితాలో రాణిత, భాస్కర్, నీలా అలియాస్ నందే, దీపక్ పాలో సహా పలువురు ఉన్నారు. వీరిలో వాసుదేవరావు తలపై రూ.కోటి రివార్డు ఉండగా.. మరికొందరిపై లక్షల్లో రివార్డులు ఉన్నట్లు తెలుస్తోంది.

# వ్యూస్, లైక్స్‌తో సోషల్ మీడియాలో ఫేమస్

హైదరాబాద్: వ్యూస్ మాయలో పడి విలువలు మరిచిపోతే ఎలా అని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ యూ ట్యూబర్లను ప్రశ్నించారు. వ్యూస్, లైక్స్‌తో సోషల్ మీడియాలో ఫేమస్ అయ్యేందుకు చిన్నారుల భవిష్యత్‌ను పణంగా పెట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనర్లతో కొన్ని యూట్యూబ్ ఛానళ్లు చేస్తున్న ఇంటర్వ్యూలను ఉద్దేశిస్తూ ఎక్స్‌లో సజ్జనార్ పోస్ట్ పెట్టారు. చిన్నారులతో అసభ్యకరమైన కంటెంట్ చేస్తూ సభ్య సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారని నిలదీశారు. చిన్నారులు, యువతకి స్ఫూర్తినిచ్చే, ఆదర్శంగా నిలిచే వ్యక్తులను ఇంటర్వ్యూలు చేసి సమాజాభివృద్ధికి దోహదం చేయండి. అంతేకానీ.. ఇలాంటి వీడియోలు వారితో చేసి పిల్లలను పెడదోవ పట్టించవద్దు. గుర్తు పెట్టుకోండి.. ఇది బాలల హక్కుల ఉల్లంఘనే కాదు.. చట్టరీత్యా నేరం. ఇటువంటి చర్యలు పోక్సో, జువైనల్ జస్టిస్ చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందని హెచ్చరించారు. పిల్లలను ఇలాంటి కంటెంట్‌లో భాగం చేయడం వారిని వేధించడం కిందికే వస్తుంది. మైనర్లతో ఈ తరహా కంటెంట్ చేసే వారిపట్ల పోలీస్‌శాఖ కఠినంగా వ్యవహరిస్తుంది. బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటుంది. తక్షణమే వీటిని తొలగించకున్నా.. భవిష్యత్తులో ఇలాంటి కంటెంట్ అప్‌లోడ్ చేసినా చట్టప్రకారం కేసులు నమోదు చేస్తాం అని కూడా హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఇలాంటి వీడియోలు మీ దృష్టికి వస్తే వెంటనే రిపోర్టు చేయండి. స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వండి. హెల్ప్‌లైన్ నంబర్ 1930కి గానీ.. జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ లో ఫిర్యాదు చేయండని సూచించారు. తల్లిదండ్రులుగా పిల్లలను పెంచడం మాత్రమే కాదు.. వారి బాల్యం, మానసిక ఆరోగ్యం, భవిష్యత్తును కాపాడటం కూడా మీ బాధ్యతే అనే విషయం మరిచిపోవద్దని సజ్జనార్ పేర్కొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో బోగస్ ఓట్లపై విచారణ



హైదరాబాద్: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బోగస్ ఓట్లపై మాజీ మంత్రి కేటీఆర్, జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో వాదనలు ముగిశాయి. పిటిషన్లపై న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పటికే ఎలక్టోరల్స్‌ను ఈసీ రివిజన్ చేస్తోందని.. ఈ సమయంలో ఎలాంటి డైరెక్షన్ అవసరం లేదని స్పష్టం చేసింది. ప్రస్తుతం ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని తేల్చిచెప్పింది హైకోర్టు. ఓటో చోరీపై హైకోర్టులో బీఆర్ఎస్ లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయగా.. గురువారం విచారణ జరిగింది. బీఆర్ఎస్ తరపు న్యాయవాది మాట్లాడుతూ.. ఇరువురి వాదనలు విన్న హైకోర్ట్ ధర్మాసనం బోగస్ ఓట్లపై ఈసీకి ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం చేస్తూ విచారణను ముగించింది.

# బిసి రిజర్వేషన్లపై ప్రభుత్వానికి దక్కని ఊరట




న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి చుక్కెదురైంది. బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ ఎస్ఎల్‌పీని సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసింది. 50 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లండని ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. పాత రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో సంబంధం లేకుండా తదుపరి విచారణ చేపట్టాలని ధర్మాసనం హైకోర్టుకు సూచించింది. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున విచారణకు స్వీకరించలేమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. తమ ఆదేశాలతో సంబంధం లేకుండా తదుపరి విచారణ చేపట్టాలని.. మెరిట్స్ ప్రకారం విచారించాలని హైకోర్టుకు సూచించింది. కావాలనుకుంటే పాత రిజర్వేషన్ల ఆధారంగా స్థానిక ఎన్నికలకు వెళ్లవచ్చని పేర్కొంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన జీఓ 9పై హైకోర్టు విధించిన స్టేను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఎస్-ఎల్‌పీ దాఖలు చేసిన విషయం తెలిసిందే. హైకోర్టు ఈ నెల 9న జారీచేసిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్‌చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 13వ తేదీన పిటిషన్ దాఖలుచేసింది. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా 16, 17వ తేదీల్లో ఏదో ఒకరోజు ఈ అంశంపై విచారించాలని మంగళవారం సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ ముందు మెన్షన్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కోరినట్లుగానే రిజిస్ట్రీ ఈ కేసును గురువారం విచారణ జాబితాలో చేర్చింది. అయితే సుప్రీంకోర్టు దీనిపై విచారణకు నిరాకరించింది. ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. రిజర్వేషన్లు 50 శాతం మించొద్దనే అభిప్రాయం సరికాదన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా

తెలంగాణలో కులగణన సర్వే జరిగిందని, ప్రభుత్వం ఇంటింటి సర్వే చేసి లెక్క తేల్చిందని సర్వోన్నత న్యాయస్థానంకు వివరించారు. రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో అన్ని పార్టీలు ఏకాభిప్రాయం వ్యక్తం చేశాయని, 3 నెలలు దాటినా బిల్లుపై గవర్నర్ నిర్ణయం తీసుకోలేదని అభిషేక్ సింఘ్వీ వాదించారు. రిజర్వేషన్లు 50 శాతం మించొద్దన్న తీర్పులు స్పష్టంగా ఉన్నాయని, కృష్ణమూర్తి జడ్జిమెంట్ ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పిందని ప్రతివాది లాయర్ వాదనలు బలంగా వినిపించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను

సుప్రీంకోర్టు తిరస్కరించింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉండటంతో విచారణకు స్వీకరించలేమని స్పష్టం చేసింది. కావాలనుకుంటే పాత రిజర్వేషన్ల ఆధారంగా స్థానిక ఎన్నికలకు వెళ్లవచ్చని పేర్కొంది. సుప్రీంకోర్టు నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వం తదుపరి తీసుకునే చర్యలపై అందరిలో ఉత్కంఠ నెలకొంది. కేబినెట్ భేటీలో ఈ అంశంపై చర్చించే అవకాశాలు ఉన్నాయి.

# బిసి రిజర్వేషన్లపై వెనక్కి తగ్గేది లేదు

న్యాయనిపుణులతో చర్చించి ముందుకు

స్థానిక ఎన్నికల్లో ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తివేత

కొత్తగా మూడు వ్యవసాయ కళాశాలు మంజూరు

మెట్రో రెండో దశపై సిఎస్ ఆధ్వర్యంలో కేబినేట్ సబ్‌కమిటీ

డిసెంబరు 1 నుంచి 9 వరకు ప్రజాపాలన విజయోత్సవాలు

తెలంగాణ కేబినేట్ భేటీలో కీలక నిర్ణయలు...హాజరు కాని కొండా సురేఖ

హైదరాబాద్,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పెంపుపై సుప్రీంకోర్టులో వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్ డిస్మిస్ కావడంతో తదుపరి కార్యాచరణపై కేబినెట్‌లో చర్చించారు. ఈ కేసును వాదించిన సీనియర్ న్యాయ వాదులు, న్యాయ నిపుణుల సలహాలు సూచనల మేరకు తదుపరి కార్యాచరణ చేపట్టాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రెండు రోజుల్లో న్యాయ నిపుణుల అభిప్రాయాలతో నివేదిక ఇవ్వాలని అధికారులకు సీఎం రేవత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయంలో వెనక్కి తగ్గేది లేదని, ముందుకు వెళ్లాలని కేబినేట్‌లో నిర్ణయించారు. ఇకపోతే స్థానిక ఎన్నికల్లో ముగ్గురు పిల్లలు ఉంటే పోటీచేయకుండా తీసుకున్న నిర్ణయాన్ని ఎత్తివేస్తూ కేబినేట్ ఆమోదించింది. సిఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో జరిగిన కేబినేట్‌లోకీలక నిర్ణయాలు తీసుకున్నారు. వివరాలను సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాకు వివరించారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నందున డిసెంబరు 1 నుంచి 9వ తేదీ వరకు ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాలు నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయిన సందర్భంగా ఉత్సవాలు నిర్వహించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు. ప్రధానంగా బీసీ రిజర్వేషన్లు, రైతు భరోసా, మైనింగ్ కొత్త పాలసీ, మెట్రో ఫేజ్-2 టెండర్లపై చర్చించారు. మెట్రో ఫేజ్-2పై సమావేశంలో ఓ నిర్ణయం తీసుకున్నారు. దీనికి సిఎస్ అధ్యక్షతన కేబినేట్ సబ్‌కమిటీ వేశారు. అయితే, కేబినెట్ భేటీకి మంత్రి కొండా సురేఖ హాజరు కాలేదు. తన ఇంటికి పోలీసులు రావడంపై ఆగ్రహంగా ఉన్నారు మంత్రి కొండా సురేఖ. ఈ నేపథ్యంలోనే కేబినెట్ భేటీకి రాకూడదని మంత్రి సురేఖ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే, జయశంకర్ వర్సిటీకి మూడు కొత్త వ్యవసాయ కళాశాలలకు కేబినేట్ ఆమోదం తెలిపింది. వ్యవసాయ కళాశాలలు లేని ఉమ్మడి నల్లగొండ, నిజామాబాద్, వికారాబాద్ జిల్లాల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే,ఆర్ అండ్ బీ హ్యామ్ రోడ్లకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.10,500 కోట్లతో నిర్మించే 5500 కిలోమీటర్ల హ్యామ్ రోడ్లకు కేబినెట్ ఆమోదించింది. త్వరలో టెండర్లు పిలవాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. స్థానిక ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లలు నిబంధనపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇద్దరు పిల్లల నిబంధన తొలగించాలని మంత్రివర్గం నిర్ణయించింది. పలు రంగాలకు భూ కేటాయింపులు జరిపేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. మద్దతు ధరతో పాటు సన్నవడ్లకు బోనస్ కూడా ఇస్తామన్నారు. వరి రికార్డు స్థాయిలో పండిందని, దానిని పూర్తిగా కొనుగోలు చేస్తామని అన్నారు.

'రాష్ట్రంలో కొత్తగా 3 వ్యవసాయ కళాశాలల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

# తాయిలాలకు లొంగితే అంతే సంగతులు !



ఎన్నికల ముందు హామీలు ఇచ్చే వారిని ప్రజలు నమ్మడం మానేస్తే ప్రజాస్వామ్యం బోలపేతం అవుతుంది. అంతెందుకు అసలు నాయకుల హామీలను పట్టించుకోవద్దు. ప్రజలు ఈ విషయంలో చైతన్యం పొందాలి. ఉచిత పథకాలు, నగదు బదిలీల హామీలను దరిచేరకుండా చూసుకోవాలి. రాజకీయ నాయకులు హామీలు ఇవ్వడం కాదు..ప్రజలు తమ ఎజెండాను నాయకుల ముందు ఉంచాలి. గ్రామాల వారీగా ప్రజలే ఎజెండా విధించాలి. రోడ్లు వేస్తారా లేదా అడగాలి. మంచినీటి సరఫరా చేస్తారా లేదా నిలదీయాలి. ఇలాంటి సమస్యల ను ఏ గ్రామానికి ఆ గ్రామ ప్రజలే గుర్తించి నాయకులకు ఎజెండా నిర్దేశించాలి. కిలోరూపాయి బియ్యం, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు వంటి వాటికి లొంగితే అంతే సంగతులు. అలా చేసి అధికారంలోకి వచ్చిన నేతలు రాష్ట్రాలను లూటీ చేసేస్తున్నారు.అందుకు తెలుగు రాష్ట్రాలు పక్కా ఉదాహరణ అని చెప్పవచ్చు. బీహార్‌లో పదేళ్లుగా అటుఇటుగా ఎన్‌డిఎ ప్రభుత్వమే నడుస్తోంది. నితీశ్ కుమార్ సిఎంగా పెద్దగా మార్పులకు శ్రీకారం చుట్టింది లేదు. అంతుకుముందు లాలూ ప్రసాద్ యాదవ్ కూడా కుటుంబ సంక్షేమానికే ప్రాధాన్యం ఇచ్చారు. లాలూ లేదా, నితీశ్ కుమార్‌లు పెద్దగా బీహార్‌లో ప్రభావితం చేసేంతగా పాలన సాగించలేదు. ఉత్తరాది రాష్ట్రాల్లో బీహార్ మొదటి నుండి రాజకీయంగా అత్యంత చురుకుగా ఉండే రాష్ట్రంగా గుర్తింపు పొందింది. బీహార్ ఓ రకంగా కళింగ రాజ్యంగా చెప్పుకోవాలి. పాటలీపుత్రాన్ని రాజధానిగా చేసుకుని మౌర్యులు పాలించారు. ఆర్య చాణక్యుడు అక్కడే ఉండేవారు. నలంద విశ్వవిద్యా లంయం ఒకప్పుడు ప్రపంచానికి మార్గం చూపింది. ఇలాంటి నేల బీహార్‌లో ఇప్పుడు అరాచకం సాగుతోంది. ఇకపోతే రాజకీయంగా ఎంతో చైతన్యం కలిగిన నేల అది. అక్కడ చోటుచేసుకునే పరిణామాలు అనేక సందర్భాలలో దేశ వ్యాప్తంగా ప్రభావం చూపాయి. దేశ రాజకీయాలకు దిశా నిర్దేశం చేశాయి. బీహార్‌కు చెందిన జయప్రకాశ్ నారాయణ్ జనతా పార్టీని స్థాపించి దేశ రాజకీయాలను మలుపు తిప్పారు. ఈ నేపథ్యంలోనే అక్కడ జరగనున్న ఎన్నికలు ఆ రాష్ట్రానికే కాకుండా దేశానికే కీలకంగా మారాయి. మరోమారు ఎన్‌డిఎ అధికారం కోసం ఎత్తులు వేస్తోంది. వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ రాజకీయంగా తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. బీహార్‌లో అధికారంలో కొనసాగడమే లక్ష్యంగా బిజెపి నేతృత్వం లోని ఎన్‌డిఎ కూటమి ఎన్నో అడ్డదారులు తొక్కుతోంది. హడావిడిగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల సవరణ (సర్)తో ఎన్నికల కమిషన్ స్వతంత్రత ప్రశ్నార్థకం గా మారింది. పెద్దఎత్తున ఓట్ చోరీ ఆరోపణలు వెల్లువెత్తాయి. వీటికి జవాబు ఇచ్చి, సందేహాలను నివృత్తి చేయాల్సిన ఎన్నికల కమిషన్ (ఇసి) గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతిపక్షాలపై దాడికి దిగుతోంది. అయితే బంగ్లా చొరబాటు దారుల సమస్య కూడా తీవ్రంగా ఉంది. ఓటర్ల జాబితాపై కొనసాగుతున్న నిరసనల మధ్యే తుది జాబితాను, ఎన్నికల షెడ్యూల్‌ను ఇసి విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం 243 మంది సభ్యులుగల బీహార్ శాసనసభకు నవంబర్ 6, 11 తేదీలలో పోలింగ్ జరగనుంది. 14వ తేదీన ఫలితాలు ప్రకటిస్తారు. మరోవైపు ఇసి విడుదల చేసిన ఓటర్ల తుది జాబితాపై కూడా దుమారం రేగుతోంది. ఈ జాబితాలోని చేర్పులు, తొలగింపులకు సంబంధించిన పూర్తి వివరాలను తమకు అందచేయడంతో పాటు, వాటిని క్షేత్రస్థాయి వరకు ప్రదర్శించాలని దేశ అత్యున్నత న్యాయస్థానం ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ఇకపోతే ఓట్ల తొలగింపు ఆరోపణలు చేస్తున్న రాహుల్ సక్రమంగా రుజువు చేయలేక పోయారు. సుప్రీం కూడా తొలగించిన ఓట్లకు సంబంధించి రుజువులతో అఫిడవిట్ వేయాలని సూచించినా వెనక్కి పోయింది. మరోవైపు ఎన్‌డిఎ కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న నితిష్ కుమార్ ఇప్పటికే 9 సార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. పదోసారి కూడా ఆ పదవిని ఆయన ఆశిస్తున్నారు. బిజెపి నేతలు ఆ విషయాన్ని తేల్చకుండా రాష్ట్రంలో ప్రభుత్వ వైఫల్యాలకు మాత్రం నితీష్‌ను పూర్తి బాధ్యుడిని చేస్తున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో ఓటర్లను మభ్య పెట్టే కుతంత్రాలకు తెరతీస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాబోయే రోజుల్లో ఈ తరహా విన్యాసాలు మరింత జోరందుకోనున్నాయి. 2020లో జరిగిన ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి కేవలం 0.2 శాతం ఓట్ల ఆధికత్యతను మాత్రమే సాధించింది. దీంతో త్వరలో జరగనున్న ఎన్నికలలో ప్రతి ఓటు కీలకంగా మారనుంది. అదే సమయంలో ప్రతిపక్షాల మధ్య గరిష్ట స్థాయిలో ఐక్యత పెరగాల్సి ఉంది. గత ఎన్నికల్లో చోటు చేసుకున్న తప్పులు మరోసారి జరగకుండా చూసుకోవడంతో పాటు, ప్రజలకు నమ్మకం ఇయ్యవలసిన బాధ్యత ప్రతిపక్షాలదే! అయితే అధికారమే పరమావధిగా అన్ని పార్టీలు విన్యాసాలు చేస్తున్నాయి. తాజాగా 7.42 కోట్ల మంది అర్హులైన ఓటర్లు ఉన్నట్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ప్రకటించారు. ఈ క్రమంలో బీహార్ అభివృద్ధికి ఏం చేస్తారన్న దానిపై రాజకీయ పార్టీల్లో స్పష్టత లేదు. కేవలం ఓట్లు కొల్లగొట్టి అధికారం దక్కించుకోవడం అందరిపనిగా మారింది. ఈ క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. నేతల కుయుక్తులను గమనించాలి. తమ ఓటును సక్రమంగా వినియోగించుకోవాలి. తాయిలాలు ఆశపడితే మరో ఐదేళ్లు లొంగిపోవాల్సి ఉంటుందని గుర్తించాలి.

# గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారికి ఆత్మీయ స్వాగతం



కర్నూలు, అక్టోబర్ 16:
ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా కర్నూలు ఎయిర్పోర్ట్ కి విచ్చేసిన గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారికి ప్రజా ప్రతినిధులు ఆత్మీయ స్వాగతం పలికారు..కర్నూలు ఎయిర్ పోర్టులో కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, భూపతి రాజు శ్రీనివాస్ శర్మ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి వి ఎన్ మాధవ్, కర్నూలు జిల్లా ఇంచార్జి మంత్రి మరియు జలవనరుల శాఖ మంత్రి వర్యులు నిమ్మల రామానాయుడు, ఆర్థిక శాఖ మంత్రి వర్యులు పయ్యావుల కేశవ్, రాష్ట్ర పరిశ్రమలు,వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్, రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ మంత్రి ఎన్ఎండి.ఫరూక్,రాష్ట్ర రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి బిసి.జనార్ధన్ రెడ్డి, చీఫ్ సెక్రెటరీ విజయానంద్, డిజిపి హరీష్ కుమార్ గుప్తా, ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్ కుమార్ మీనా, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, డోన్ ఎమ్మెల్యే జయసూర్యప్రకాష్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, ఆలూరు ఎంఎల్ఏ విరూపాక్షి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆది నారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, మధుసూదన్, మయానా జాకియా ఖానం, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నాయకులు సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, బాపురం రామకృష్ణ, మధుసూదన్ రెడ్డి, చింతా సురేష్ తదితరులు స్వాగతం పలికారు.పర్యటనలో భాగంగా కర్నూలు ఎయిర్ పోర్టు నుండి హెలికాప్టర్ లో సున్నిపెంట హెలిప్యాడ్ కి వెళ్ళి శ్రీశైలం మల్లికార్జున స్వామి దర్శనం చేసుకొని అనంతరం సున్నిపెంట హెలిప్యాడ్ నుండి రాగమయూరి వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు వచ్చి అనంతరం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని ముగించుకొని సా.4.50 గం.లకు కర్నూలు ఎయిర్ పోర్ట్ నుండి ఢిల్లీ కి బయలుదేరి వెళ్లారు.




కర్నూలు విమానాశ్రయంలో ప్రధాని మోదీ గారికి వీడ్కోలు పలికిన సీఎం, డిప్యూటీ సీఎం, కూటమి నేతలు.

## కర్నూలులో సూపర్ జీఎస్టీ -సూపర్ సేవింగ్స్ బచత్ ఉత్సవ్ బహిరంగ సభకు ప్రధాని మోదీతో కలిసి హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...




శక్తిపీఠం, జ్యోతిర్లింగం ఒకేచోట కొలువై ఉన్న దివ్యక్షేత్రం శ్రీశైలం, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పుట్టిన పౌరుషాల గడ్డ లో జీఎస్టీ బచత్ ఉత్సవ్ సభకు ప్రధాని హాజరు కావటం సంతోషంగా ఉంది.జీఎస్టీ సంస్కరణలతో దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ప్రధాని మోదీకి ఏపీ ప్రజల తరపున అభినందనలు.ముఖ్యమంత్రిగా... ప్రధానిగా 25 ఏళ్లుగా ప్రజాసేవలో ఉన్న ప్రధానికి ప్రత్యేక అభినందనలు.సరైన సమయంలో సరైన చోట సరైన వ్యక్తిగా ప్రధాని మోదీ ఓ విశిష్టమైన వ్యక్తి.. 21వ శతాబ్దపు నేత.ఎందరో ప్రధానమంత్రులతో కలిసి పని చేసినా మోదీ లాంటి వ్యక్తిని చూడలేదు. విరామం, విశ్రాంతి లేకుండా నిర్విరామంగా ప్రజాసేవలోనే ఉంటున్న అరుదైన వ్యక్తి మోదీ.ప్రధాని మోదీ తెచ్చిన సంస్కరణలు దేశానికి గేమ్ చేంజర్లుగా మారాయి. ప్రగతిశీల దేశంగా 2047 నాటికి భారత్ ప్రపంచంలో అగ్రస్థానంలో నిలిచి సూపర్ పవర్ గా తయారవుతుంది.11 ఏళ్లలో 4 కోట్ల కుటుంబాలకు పక్కా ఇళ్లు, 81 కోట్ల మందికి ఉచితంగా రేషన్, 144 వందే భారత్ రైళ్లు, 55 వేల కి.మీ మేర కొత్త హైవేలు, 86 ఎయిర్ పోర్టులు, 16 ఎయిమ్స్ ఆస్పత్రులు నిర్మించిన ఘనత ప్రధాని మోదీదే. 7 ఐఐటీలు, 8 ఐఐఎంలను తీసుకువచ్చిన రికార్డు కూడా ప్రధాని మోదీదే ఇది ఆల్ టైం రికార్డు. ప్రధాని సంకల్పంతోనే 11 ఏళ్ల క్రితం 11వ ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ 4వ స్థానానికి వచ్చింది. 2028 నాటికి 3వ, 2038కి 2వ ఆర్థిక శక్తిగా భారత్ ఎదుగుతుంది. ఆర్థికంగా మనం బలం ఏంటో ఈ విజయాలు చెబితే...సైనికంగా మన బలం ఏంటో ఆపరేషన్ సింధూర్ చాటింది.

## ఘన స్వాగతం పలికారు.దేవస్థానం ప్రధాన ద్వారం వద్ద వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం







**శ్రీశైలం / నంద్యాల జిల్లా : 16-10-2025**

అనంతరం ఉదయం 11:38 గంటలకు గౌరవ భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు భ్రమరాంబ గెస్ట్ హౌస్ నుండి బయలుదేరి నంది మండపం సర్కిల్ ద్వారా దేవాలయ ప్రాంగణంలోని గంగాధర మండపం వైపు పయనమయ్యారు.నంది మండపం సర్కిల్ నుండి గంగాధర మండపం వరకు మార్గమంతా దాదాపు 8,000 మంది శివసేవకులు కాషాయ వస్త్రధారణలో నిలబడి హర హర మహాదేవ అంటూ ప్రధానమంత్రి గారికి ఘన స్వాగతం పలికారు.దేవస్థానం ప్రధాన ద్వారం వద్ద వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి భారత ప్రధానమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి గార్లకు విభూతి, కుంకుమ ధరింపజేసి ప్రదక్షిణాకార మార్గంలో ఆలయ అంతర్భాగానికి ఆహ్వానించారు.అనంతరం మొదట ధ్వజస్తంభ నమస్కారం, శివ సంకల్పం, అనంతరం రత్నగర్భ గణపతి పూజ నిర్వహించారు. తరువాత మూలవిరాట్ శ్రీ మల్లికార్జున స్వామి జ్యోతిర్లింగానికి ఏకవార రుద్రాభిషేకం, బిల్వార్చన, పుష్పార్చన, మహా మంగళ హారతి, మంత్రపుష్పాలతో భక్తిశ్రద్ధలతో దర్శనం చేశారు. తదుపరి నందీశ్వర దర్శనం చేసి, అర్చకులచే స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం సరస్వతి నది అంతర్వాహినిగా ప్రసిద్ధి చెందిన మల్లికాగుండం వద్ద శ్రీ స్వామివారి గర్భాలయ శిఖర దర్శనం చేసుకున్నారు.ఆ తర్వాత ప్రధానమంత్రి గారు శ్రీ భ్రమరాంబ అమ్మవారి ముఖ మండపంలో ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించిన శ్రీ చక్రమునకు ఖడ్గమాలతో కుంకుమార్చన నిర్వహించి, షోడశోపచార పూజలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. అనంతరం అమ్మవారి హారతి స్వీకరించారు.తరువాత వేదాశీర్వచన మండపంలో వేద పండితులు చతుర్వేద ఆశీర్వచనం చేసి, అమ్మవారి తీర్థప్రసాదాలను ప్రధానమంత్రి గారికి సమర్పించారు.ఈ సందర్భంగా ప్రధానమంత్రికి శ్రీ స్వామి, అమ్మవార్ల చిత్రపటాలు మరియు శేష వస్త్రాలను రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు గౌరవ ప్రద భారత ప్రధానమంత్రి గారికి అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి గణియా గారు, జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షెరాన్ గారు, జాయింట్ కలెక్టర్ శ్రీ సి. విష్ణు చరణ్ గారు, అడిషనల్ ఐజి ఆకే రవి కృష్ణ, పోలీసు ఉన్నతాధికారి అధి రాజ్ సింగ్ రాణా, ఆలయ ఈఓ శ్రీనివాసులు తదితర అధికారులు ప్రధానమంత్రిని అనుసరించి పాల్గొన్నారు.డిఐపిఆర్ఓ, నంద్యాల.

# స్వర్ణాంధ్రతోనే వికసిత్ భారత్ లక్ష్యం సాకారం



**గూగుల్ రాకతో ప్రపంచమంతా ఏపీ వైపు చూస్తోంది.**

**ఆత్మనిర్భర్ భారత్ కు సరికొత్త శక్తిగా ఏపీ**

**చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి**

**నారా లోకేష్ సారధ్యంలో పండుగలా జీఎస్టీ సంస్కరణల ప్రచారం**

**కర్నూలులో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోదీ**

**ఏపీలో రూ.13,429 కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టిన ప్రధాని**



**కర్నూలు, అక్టోబర్ 16:**

వికసిత్ ఏపీతోనే వికసిత్ భారత్ లక్ష్యం సాకారం అవుతుందని ప్రధాని నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించినప్పుడే జీఎస్టీ సంస్కరణలకు సార్ధకత చేకూరుతుందని స్పష్టం చేశారు. వికసిత్ భారత్, ఆత్మనిర్భర్ భారత్ వంటివి సాకారం కావడంలో ఏపీ కీలక పాత్ర పోషిస్తుందని ప్రధాని స్పష్టం చేశారు. ఏపీ యువత ఎంతో చైతన్య కలిగిన వారని... సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వంటి వారి నేతృత్వంలో ఏపీ అభివృద్ధి పథంలో వెళ్తోందని... కేంద్రం కూడా పూర్తిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సహకరిస్తుందని ప్రధాని చెప్పారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ బహిరంగ సభ గురువారం నన్నూరు చెక్ పోస్ట్ సమీపంలో జరిగింది. శ్రీశైలంలో మల్లిఖార్జున స్వామి వారిని, భ్రమరాంబ అమ్మవారిని దర్శించుకున్న అనంతరం అనంతరం ప్రధాని కర్నూలు చేరుకున్నారు. కర్నూలులో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ జీఎస్టీ బచత్ ఉత్సవ్ పై ఏర్పాటు చేసిన బహిరంగ సభా వేదికకు చేరుకున్న ప్రధానికి మంత్రులు, ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికారు. హెలీప్యాడ్ నుంచి సభా ప్రాంగణం వరకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఓపెన్ టాప్ జీపులో ప్రజలకు అభివాదం చేస్తూ వేదికపైకి చేరుకున్నారు. ఓపెన్ టాప్ జీపులో ర్యాలీగా వచ్చిన ముగ్గురు నేతలకు భారత్ మాతాకీ జై అంటూ మువ్వెన్నల జెండాలతో ప్రజలు స్వాగతం పలికారు. బహిరంగ సభలో జీఎస్టీ సంస్కరణలపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ..."ఆంధ్రప్రదేశ్ శాస్త్రసాంకేతికంగా అభివృద్ధి చెందిన ప్రాంతం, యువత ఎంతో చైతన్యవంతులు. ఏపీలో విజన్ ఉన్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ లాంటి నేతలు ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా ఉంది. గత 16 నెలల్లో డబుల్ ఇంజన్ సర్కారు వల్ల ఏపీలో ప్రగతి వేగంగా జరుగుతోంది. ఢిల్లీ, అమరావతిలు రెండూ అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు వెళ్తున్నాయి. దేశ ఆర్థిక విప్లవానికి ఆంధ్రప్రదేశ్ ఓ కీలక ప్రాంతంగా ఉంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి దిశగా నడుస్తోంది. భారత్ దేశంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రగతి వేగాన్ని ప్రపంచం గమనిస్తోంది. గూగుల్ లాంటి ఐటీ దిగ్గజం ఏపీలో అతిపెద్ద పెట్టుబడిని ప్రకటించింది. దేశపు తొలి అతిపెద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కేంద్రం విశాఖలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అమెరికా వెలుపల భారీ పెట్టుబడితో ఏపీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్ పెడుతున్నట్టు గూగుల్ సీఈఓ నాతో చెప్పారు. డేటా సెంటర్, ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్ లాంటి అత్యాధునిక మౌలిక సదుపాయాలు ఈ కేంద్రంలో ఏర్పాటు కాబోతున్నాయి. ప్రపంచ దేశాలను కలుపుతూ వేయనున్న సబ్ సీ కేబుల్ ద్వారా తూర్పు తీరం బలోపేతం అవుతుంది. విశాఖలో ఏర్పాటు కానున్న కనెక్టివిటీ హబ్ భారత్ కే కాదు ప్రపంచానికి సేవలందిస్తుంది. ఈ విషయంలో సీఎం చంద్రబాబు విజన్ ను అభినందిస్తున్నాను. 21వ శతాబ్దపు మాన్యుఫాక్చరింగ్ కేంద్రంగా ప్రపంచ దేశాలు భారత్ వైపు చూస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం భారత్ ఉత్పత్తి కేంద్రంగా రూపు దిద్దుకుంటోంది. ఆత్మనిర్భర్ భారత్ లో ఏపీ కీలకంగా మారింది." అని ప్రధాని అన్నారు.

### ఆంధ్ర ప్రదేశ్ ప్రగతిని కాంగ్రెస్ నాశనం చేసింది

"కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆంధ్రప్రదేశ్ ప్రగతిని నాశనం చేశాయి. ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో ఏపీ ప్రగతి ద్వారాలు తెరుచుకుని వేగంగా అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది. దేశ ప్రగతికి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చాలా కీలకం. రాయలసీమ అభివృద్ధితోనే ఏపీ అభవృద్ధి ఉంది. కర్నూలులో ప్రారంభించిన ప్రాజెక్టులు రాయలసీమ ప్రాంత ప్రగతికి సరికొత్త ద్వారాలు తెరుస్తాయి. పారిశ్రామిక అభివృద్ధి వేగంగా జరుగుతుంది. ఏపీ వేగవంతమైన అభివృద్ధి కోసం కొప్పర్తి -ఒర్వకల్ పారిశ్రామిక నోడ్ల ద్వారా వచ్చే పెట్టుబడులతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. రాయలసీమలోని ప్రతి జిల్లాలోనూ ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయి.



ఆత్మనిర్భర్ భారత్ కు సరికొత్త శక్తిగా ఏపీ తయారవుతోంది. కృష్ణా జిల్లా నిమ్మకూరులో రక్షణ రంగానికి చెందిన నైట్ విజన్ గాగుల్స్, క్షిపణుల సెన్సార్లు, డ్రోన్ గార్డులను తయారు చేసే సంస్థ ఏర్పాటు కావడం ముదావహం. రక్షణ రంగ ఉత్పత్తుల ఎగుమతులు కూడా చేసేందుకు ఆస్కారం ఇస్తుంది. ఆపరేషన్ సింధూర్ లో దేశంలో తయారైన ఉత్పత్తుల బలం ఏమిటో చూశాం. కర్నూలును భారత్ డ్రోన్ హబ్ తయారు చేయాలని ఏపీ నిర్ణయించటం సంతోషం. ఆపరేషన్ సింధూర్ ద్వారా డ్రోన్ల పనితీరు ఏమిటో తెలియచెప్పింది. డ్రోన్ల తయారీ ద్వారా కర్నూలు భారత్ కు ఓ గర్వకారణంగా నిలుస్తుంది." అని ప్రధాన మంత్రి చెప్పారు.

### ప్రారంభించిన ప్రాజెక్టులు ప్రగతికి మార్గాలు

"ఈ ప్రాజెక్టులన్నీ రాష్ట్రంలో కనెక్టివిటి బలోపేతం కావటంతో పాటు పరిశ్రమలను బలోపేతం చేస్తాయి. ఈ ప్రాజెక్టులతో కర్నూలుతో పాటు పరిసర ప్రాంతాలకు ప్రయోజనం కలుగుతుంది. దేశానికైనా, రాష్ట్రానికైనా ఇంధన భద్రత అవసరం. ప్రస్తుతం 3 వేల కోట్ల విలువైన ట్రాన్స్ మిషన్ ప్రాజెక్టులను ప్రారంభించాం. తద్వారా దేశ ఇంధన సామర్థ్యం పెరుగుతుంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు బ్లాక్ అవుట్ లాంటి విద్యుత్ సంక్షోభాలు వచ్చాయి. తలసరి విద్యుత్ వినియోగం 1000 యూనిట్ల కంటే తక్కువే ఉంది. చాలా గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు కూడా లేని పరిస్థితి. ఇప్పుడు క్లీన్ ఎనర్జీ నుంచి మన అవసరాలకు తగినంత ఉత్పత్తిలో రికార్డులు సృష్టిస్తున్నాం. 1400 యూనిట్ల తలసరి విద్యుత్ వినియోగం ఇప్పుడు దేశంలో ఉంది. తగినంత విద్యుత్ దేశ ప్రజలకు లభ్యం అవుతోంది. శ్రీకాకుళం నుంచి అంగుల్ వరకూ గ్యాస్ పైప్ లైన్ ను జాతికి అంకితం చేశాం. 20 వేల సిలెండర్ల సామర్థ్యంతో ఇండేన్ బాటిలింగ్ ప్లాంట్ ను చిత్తూరులో ప్రారంభించాం. మల్టీమోడల్ ఇన్ఫ్రా ప్రాజెక్టులతో కనెక్టివిటీ పెంచుతున్నాం. సబ్బవరం నుంచి షీలా నగర్ వరకూ కొత్త హైవేతో కనెక్టివిటీ పెరిగింది. రైల్వే రంగంలో కొత్త యుగం ప్రారంభమైంది. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందేలా ప్రాజెక్టులను ప్రారంభించుకున్నాం. స్వాతంత్ర్యం సాధించి వందేళ్లు పూర్తైన 2047 నాటికి దేశం వికసిత్ భారత్ గా తయారవుతుంది. వికసిత్ భారత్ 2047 సాధన సంకల్పానికి స్వర్ణాంధ్ర లక్ష్యం మరింత బలం అందిస్తుంది." అని మోదీ వెల్లడించారు.

### ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం

"పౌరులకు అవసరాలకు అనుగుణంగా అభివృద్ది చేయాలనేది ఎన్డీఏ ప్రభుత్వ నినాదం. ఈజ్ ఆఫ్ లివింగ్ అనే అధ్యాయం దేశంలో ప్రారంభమైంది. ప్రజల జీవితాలను సులభతరం చేసే సంకల్పంతో ఎన్డీఏ పని చేస్తోంది. 12 లక్షల ఆదాయం ఉన్న ప్రతీ ఒక్కరికి పన్ను లేకుండా చేశాం. వృద్ధుల కోసం ఆయుష్మాన్ భారత్ లాంటి సదుపాయాలు కల్పిస్తున్నాం. సరిగ్గా నవరాత్రి ముందు జీఎస్టీ సంస్కరణలు అమల్లోకి తీసుకువచ్చాం. ప్రజలపై పన్నుల భారం తొలగించాం. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో జీఎస్టీ పొదుపు ఉత్సవాన్ని పండుగలా చేసుకున్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పేరిట కార్యక్రమాలు చేపట్టటం అభినందనీయం. ఈ జీఎస్టీ సంస్కరణల వల్ల రూ.8 వేల కోట్ల మేర ప్రజలకు ఆదా అవటం సంతోషం. కానీ ఆ ప్రయోజనాలు అందరికీ అందాల్సి ఉంది... అప్పుడే అది సఫలమైనట్టు. 21 వ శతాబ్దం భారత దేశానిది, 140 కోట్ల మంది భారతీయులది." అని ప్రధాని చెప్పారు.

### శ్రీశైల దర్శనం ఆనందాన్నిచ్చింది

"ఢిల్లీ నుంచి నుంచి నేరుగా కర్నూలు ఎయిర్ పోర్టుకు చేరుకున్న ప్రధాని నరేంద్ర మోదీకి గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సహా... వివిధ ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. కర్నూలు ఎయిర్ పోర్టు నుంచి సీఎం, డెప్యూటీ సీఎంలతో కలిసి శ్రీశైల దేవస్థానానికి హెలీకాప్టరులో వెళ్లారు. దేవస్థానంలో కొలువైన శ్రీశైల భ్రమరాంబిక, మల్లిఖార్జున స్వామి వార్లను ప్రధాని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశైల క్షేత్రం విశేషాలను ప్రధాని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రధానికి వేదశీర్వాచనాలిచ్చి... తీర్థ ప్రసాదాలు అందించారు. ఆ తర్వాత ఛత్రపతి శివాజీ ధ్యాన మందిరాన్ని ప్రధాని సహా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సందర్శించారు. అక్కడున్న శిల్పాలను, చిత్రపటాల్లోని విశేషాలను ప్రధానికి నిర్వాహకులు వివరించారు. అనంతరం భ్రమరాంబిక గెస్ట్ హౌసులో ప్రధాని భోజన విరామం తీసుకున్నారు. ఆ తర్వాత హెలీకాప్టర్ ద్వారా కర్నూలులో సూపర్ సేవింగ్స్-సూపర్ జీఎస్టీ బహిరంగ సభ ప్రాంగణానికి చేరుకున్నారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ప్రచారంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన స్కూలు విద్యార్థులు అందించిన చిత్రపటాన్ని ప్రధాని అందుకున్నారు. రాయలసీమ ప్రాంతంలో కొలువైన అహోబిలం నర్సింహస్వామి, మహా నందీశ్వరుడు, మంత్రాలయం రాఘవేంద్ర స్వామి ప్రాశస్త్యాన్ని ప్రధాని తన ప్రసంగంలో గుర్తు చేసుకున్నారు. ద్వాదశ జ్యోతిర్లింగాలలో తొలి జ్యోతిర్లింగం ఉన్న సోమనాధ్ ఆలయం ఉన్న గుజరాత్ లో తాను జన్మించానని.. విశ్వనాధుడి భూమి వారణాసిలో సేవచేసే అవకాశం దక్కిందని అన్నారు. రెండో జ్యోతిర్లింగం శ్రీశైల మల్లిఖార్జున స్వామిదని.. ఇప్పుడు శ్రీశైలం వచ్చి మల్లిఖార్జున స్వామి వారి ఆశీర్వచనాలు తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఛత్రపతి శివాజీ ధ్యాన మందిరాన్ని కూడా దర్శించానని ఛత్రపతి శివాజీ, అల్లమ్మ ప్రభు, అక్కమహాదేవి లాంటి శివభక్తులకు ప్రణామాలు తెలిపారు. ఉయ్యాలవాడ నర్సింహారెడ్డి లాంటి ధీరులకు నమస్కారం చేస్తున్నానని ప్రధాని అన్నారు. ఈ సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ బహిరంగ సభలో గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ, మంత్రి నారా లోకేష్ సహా పలువురు కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేడు తెలంగాణ రాష్ట్రం బంద్?

హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్



బీసీల కోసం రాజ్యాంగాన్ని మరోసారి సవరించలేరా జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు. రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణయ్య ఆర్.కృష్ణయ్య
తెలంగాణ బీసీల కోసం రాజ్యాంగాన్ని మరోసారి సవరించలేరా అంటూ ఎంపీ, జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. గతంలో రాజ్యాంగాన్ని 104 సార్లు సవరించారని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికే 9వ షెడ్యూల్ పై కోర్టులో పదుల కొద్ది కేసులు పెండింగ్ లో ఉన్నాయని, మళ్లీ కోర్టుకు వెళ్లడంలో ప్రయోజనం లేదన్నారు. పార్లమెంట్ ద్వారానే ఇది సాధ్యమవుతుందని తెలిపారు. బీసీలకు కోర్టులు కూడా వ్యతిరేకంగా ఉన్నాయని అనుమానం వ్యక్తం చేశారు. నేడు స్వచ్ఛందంగా తెలంగాణ రాష్ట్రం బంద్ చేయాలని కోరారు.

# “గల్లి కో శంకర్ దాదా” మందిస్తే గోవిందా.?

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, ఉదయం న్యూస్



హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరిలో విచ్చలవిడిగా నకిలీ క్లినిక్‌ల పేరుతో అర్హత లేని వ్యక్తులు వైద్యం చేసేస్తున్నారు. ఇప్పటివరకు ఈ మూడు జిల్లాల్లో 250 క్లినిక్‌లను టీజీఎంసీ గుర్తించింది. చాలామంది పది, ఇంటర్ చదివి ఆర్‌ఎంపీల పేరుతో క్లినిక్‌లు నడుపుతున్నారు. ఆసుపత్రుల్లో కాంపౌండర్‌గా కొన్నాళ్లు ప్రాక్టీసు చేసి..ఏకంగా చిన్న ఆసుపత్రులు తెరుస్తున్నారు. తెలిసీ తెలియని వైద్యంతో కొందరు ఏకంగా అబార్షన్లు చేస్తున్నారు. చిన్న చిన్న శస్త్రచికిత్సలు చేసేందుకు కూడా వెనకాడటం లేదు.

## జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత!

హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్



జర్నలిస్టులపై దాడులు దౌర్జన్యాల నివారణకు ప్రత్యేక చర్యలు,
హైదరాబాద్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. జర్నలిస్టుల కోసం ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన జర్నలిస్టులకు అందేలా విధి విధానాలను రూపొందిస్తున్నామని తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ కమీషనర్ సిహెచ్. ప్రియాంక, సిపిఆర్వో మల్సూర్ తో కలిసి అక్రిడిటేషన్ పాలసీపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.అర్హులైన జర్నలిస్టుల గౌరవాన్ని కాపాడేవిధంగా శాస్త్రీయ పద్ధతిలో అక్రిడిటేషన్ పాలసీ ఉండాలని అధికారులను ఆదేశించారు. వీలైనంత త్వరగా అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయడానికి ఈనెల చివరినాటికి పాలసీ విధివిధానాలను కొలిక్కి తీసుకురావాలని ఆదేశించారు. అదేవిధంగా ఉద్యోగ భద్రత, జర్నలిస్టులు రాసే కథనాలు ఇతర అంశాలను జీర్ణించుకోలేక పాల్పడే దాడులు, దౌర్జన్యాలు, బెదిరింపుల అంశాలు వారికి భద్రత తదితర జర్నలిస్టు ప్రయోజనాలపై కమిటీలో చర్చించారు.

## ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 5వ మహాసభలు అనకాపల్లిలో.

ఉదయం న్యూస్ అల్లూరి జిల్లా పాడేరు సెప్టెంబర్ 17:




ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర ఐదవ మహాసభలు నవంబర్ 8, 9 తేదీలలో అనకాపల్లిలో జరగనున్నాయని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు కే. శాంతి,వి.సత్యవతి, జిల్లా కోశాధికారి ఈ.పార్వతి కార్యదర్శి ఎం. సూర్య కళ తెలిపారు. ఈరోజు దొడ్డి రామానాయుడు భవనంలో పత్రికా విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నేషనల్ హెల్త్ మిషన్ ఏర్పడి 20 సంవత్సరాలు అయిందని, గత 20 సంవత్సరాలుగా ఆశా కార్యకర్తలు గ్రామీణ ప్రాంతంలో గర్భిణీలకు, బాలింతలకు, ప్రజల వైద్య సేవలు అందిస్తున్నారని హెచ్ ఐ వి, లెపర్సీ, క్షయ వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రజలను చైతన్యం చేస్తున్నారని, గ్రామంలో ఆరోగ్య అవగాహన, పరిశుభ్రత కోసం నిరంతరం ప్రజల్ని చైతన్యం చేస్తున్నారని, ఆశా కార్యకర్తల కృషి వలన మాత, శిశు మరణాలు తగ్గి ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరిగిందని దీనికి కారణం ఆశా కార్యకర్తల కృషి చేయడమని ఈ ఆశా కార్యకర్తల సంఘం ఐదవ రాష్ట్ర మహాసభ అనకాపల్లిలో జరగనున్నదని ఈ మహాసభ కి రాష్ట్రంలో అన్ని జిల్లాల నుండి 300 మంది ప్రతినిధులు, ఆశా వర్కర్స్ యూనియన్ అఖిల భారత నాయకులు హాజరవుతారని దీనిని జైప్రధానికి ప్రజలు సహకరించాలని .వి. సత్యవతి. ప్రధాన కార్యదర్శి కోరారు.

# అగ్రవర్ణం నాటకాలు బయటపడ్డాయి అఖిలపక్ష ఐక్య వేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్.

ఉదయం న్యూస్ వనపర్తి



అగ్రవర్ణ నాటకాలు బయటపడ్డాయి, ప్రభుత్వం వేసిన కేసు సుప్రీంకోర్టు కొట్టి వేసింది. బందును ఉధృతం చేయాలి ప్రజలకు పిలుపునిచ్చిన అఖిలపక్ష ఐక్యవేదిక.

అలాగే బీ సీ లకు 42 శాతం రిజర్వేషన్లు సాధించుట కై తలపెట్టిన తెలంగాణ రాష్ట్ర బందుకు మద్దతు తెలిపిన రాజకీయ పార్టీలకు, ప్రజా సంఘాలకు ధన్యవాదాలు తెలుపుతూ ప్రసంగించిన అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా “సతీష్ యాదవ్. ఈరోజు బందును జయప్రదం చేయడానికి పలు సంఘాలను సంస్థలను మూడు జట్లుగా విడిపోయి అందర్నీ కలుస్తూ, మొదటి జట్టుగా ఉన్న మేము పత్రికా ముఖంగా మాకు నిన్న సంఘీభావం తెలిపిన బీ.ఆర్.ఎస్, బిజెపి, సిపిఐ, టి.జన సమితి ఎమ్మార్పీఎస్, టిడిపి, పార్టీలకు ధన్యవాదాలు తెలుపుతూ వారిని ఆహ్వానిస్తూ వారితో మమేకమై రేపటి నుండి బంద్ కార్యక్రమము ఎలా చేయాలో తెలుసుకుంటూ వారిని ముందు పెట్టి మేము బందును ప్రశాంతంగా విజయవంతం చేయాలని నిర్ణయించుకున్నామని, ఈరోజు సుప్రీంకోర్టులో కేసు కొట్టి వేశారు. దీన్ని బట్టి చూస్తే వీళ్ళ నాటకాలు బయట పడ్డాయని తెలిసింది, అధికారంలో ఉండి కూడా పార్టీ పరంగా ఇస్తానని అనడం మోసగించడమేనని ఇది కచ్చితంగా ఖండించవలసిన విషయమేనని బీసీ సంఘాలు ప్రజలు గుర్తుంచుకోవాలని తెలుపుతూ బందును ఉధృతం చేయాలని ఇది బీసీ జే.ఏ.సీ, బీసీ ఐక్యవేదిక నిర్ణయం అని అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా” సతీష్ యాదవ్ తెలిపారు.
ఈ కార్యక్రమంలో డాక్టర్ సతీష్ యాదవ్ తో పాటు టీజేఎస్ జిల్లా అధ్యక్షులు ఖాదర్బాషా, టిడిపి నాయకులు కొత్తగొల్ల శంకర్, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు గౌనికాడి ద యాదయ్య, బొడ్డుపల్లి సతీష్, నాగరాజు పాల్గొన్నారు

# ఖరీఫ్ 2025-26 సీజన్ వరిధాన్యం సులభంగా రైతులకు

**ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ జరిగేలా అందరూ మిల్లర్లు మరియు అధికారులు పనిచేయాలని**

**జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు**

సిద్దిపేట ప్రతినిధి, ఉదయం న్యూస్



సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధులు, జిల్లా సివిల్ సప్లై, డిఆర్డిఓ అధికారులందరితో జిల్లా కలెక్టర్ జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ అబ్దుల్ హమీద్ తో కలిసి సమావేశం నిర్వహించారు.
ఈ సమావేశం లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.
ఖరీఫ్ సీజన్ లో వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ సివిల్ సప్లై శాఖ అందించిన మార్గదర్శకాల ప్రకారం కొనుగోలు చేయాలని అధికారులను, మిల్లర్ ప్రతినిధులకు తెలిపారు. ఈ సీజన్ లో 6లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నాం. జిల్లాలో 439 వరి ధాన్యం సెంటర్ లలో ఇప్పటి వరకు 239 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం. కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం రాగానే గన్ని లలో నింపి లోడ్ చేసి మిల్లులకు పంపిస్తాం. మిల్లులో కూడా తేమ శాతం తనికి చేయాలని సూచించారు. ఆయా కొనుగోలు కేంద్రాలను కేటాయించడం కోసం మిల్లర్ ప్రతినిధులు అగ్రిమెంట్
చేసుకుని బ్యాంక్ గారంటీ తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. వరి ధాన్యం దిగుమతి లో ఆలస్యం చెయ్యవద్దనీ దిగుమతి చేసుకోగానే ఆన్లైన్ లో ఎంట్రీ చెయ్యాలని తెలిపారు. ఫిజికల్ స్టాక్ మరియు రిజిస్టర్ ఎంట్రీ టాలీ కావాలని తెలిపారు. లేబర్ కొరత లేకుండా చూసుకోవాలి. ఎక్కడ కూడా ధాన్యం మళ్లించడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా సివిల్ సప్లై అధికారులను తెలిపి పరిష్కరించుకోవాలి. ఓపిఎంఎస్ పోర్టల్ లో అప్లోడ్ చేసే విధానం తెలుసుకోవాలి. గతం లాగానే వరిధాన్యం కొనుగోలు లో విజయవంతం చేసిన విధంగానే ఈ ఖరీఫ్ లో కూడా కొనుగోలు ప్రక్రియ కొనసాగాలని తెలిపారు.
ఈ సమావేశం డిసిఎస్ఓ తనూజ, డిఎం సివిల్ ప్రవీణ్, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య, డిటిఓ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



# సమన్వయంతో పనిచేస్తేనే సత్ఫలితాలు సాధ్యం

రాయచోటి, అక్టోబర్ 16: (ఉదయం ప్రతినిధి)

విద్యా, వైద్య, శిశు సంక్షేమ శాఖలు అతి ముఖ్యమైనవని వీరంతా కలసి సమన్వయం తో పని చేసి సత్ఫలితాలు దిశగా జిల్లాను ముందుకు తీసుకు వెళ్ళాలని పేర్కొన్నారు. పోషణ అభియాన్ కార్యక్రమం లో భాగంగా 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమాన్ని “ఆరోగ్యవంత మైన మహిళా - శక్తి వంతమైన కుటుంబానికి బలమైన పునాది” అనే అంశం తో సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 16 వరకు జిల్లా లో ఒక నెల పాటు నిర్వహించి జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాయచోటి లోని సుధా కన్వెన్షన్ హాల్ నందు మాసోత్సవాల ముగింపు కార్యక్రమం లో ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్
ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.ప్రతి సంవత్సరం జాతీయ స్థాయిలో జరిగే పోషణ అభియాన్ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం “ఆరోగ్యవంత మైన మహిళా - శక్తి వంతమైన కుటుంబానికి బలమైన పునాది” అనే అంశం పైన దాదాపు ఒక నెల నుంచి ఈ పోషణ అభియాన్ అనే కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఒక జాతీయ స్థాయి కార్యక్రమం ప్రతి సంవత్సరం ఒక నెల పాటు ఈ పోషణ అభియాన్ కార్యక్రమం జాతీయ స్థాయిలో ప్రతి రాష్ట్రంలో ప్రతి జిల్లాలో జరుపుకోవడం జరుగుతుందని, దీని ముఖ్య ఉద్దేశం ప్రతి సంవత్సరం ఒక్కొక్క థీమ్స్ మీద ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరియు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నాయని ఈ సంవత్సరం దీనికి కొన్ని థీమ్స్ సెలెక్ట్ చేయడం జరిగిందని ఇందులో భాగంగా పిల్లలలోఉబకాయం ఉండడం, మనం తినే ఆహారంలో కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉండడం వల్ల ఏ విధంగా ఆరోగ్య సమస్యలు రావచ్చు దీని గురించి ఈ ఇయర్ థీమ్ పెట్టడం జరిగిందని తర్వాత ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ చిన్న వయస్సులో పిల్లల్ని ఎలా బాగా చూసుకోవాలి. ఏ విధంగా వారికి మంచి ఎడ్యుకేషన్ మరియు ఆహారం దాన్ని మనకి ఏ విధంగా మంచి పోషణ అందిస్తుంది, దీని గురించి ఈ సంవత్సరం థీమ్ పెట్టడం జరిగింది. ఈ ఏరియాలో పండుతున్న క్రాప్స్ కానీ, కూరగాయలు, ఫ్రూట్స్ అవన్నీ మనం తింటే ఈ ఏరియాకి ఉన్న అనుకులతను వాతావరణ ప్రకారం మనకి ఒక మంచి పోషణ దీని ద్వారా దొరుకుతుందని తెలిపారు.
గతం లో పార్వతీపుర, మన్యం జిల్లాలు ఏర్పడిన తరువాత అక్కడ అనుభవాన్ని పంచుకుంటూ..అక్కడ 1000మంది పిల్లలు పుడితే వారిలో దాదాపు 25 మంది పిల్లలు పౌష్టికాహార లోపం వల్ల పుట్టిన సంవత్సరం లోపు చనిపోతున్నారని తెలియజేసారు. దీనికి రకరకాల కారణాలతో ముఖ్యంగా బరువు తక్కువగా ఉండటం, తల్లి గర్భం దాల్చిన సమయం లో ప్రతి రోజు తీసుకునే ఆహరంలో పౌష్టికాహార లోపం మరియు వారికీ 9 నెలల పాటు అందించాల్సిన వైద్య సదుపాయాలు అందకపోవడం తదితర కారణాలే కాకుండా డెలివరి సమయం లో ప్రతి నెలలో దాదాపు మాత శిశు మరణాల సంఖ్య కూడా ఎక్కువగా ఉండటం గమనించడం జరిగిందని తెలిపారు. వీటి అన్నిటికి పరిష్కారం ఇలాంటి కార్యక్రమాలను క్రింది స్థాయికి తీసుకువెళ్లి అవగాహన కల్పించడం ముఖ్యమని తెలియజేశారు.ఇలాంటి కార్యక్రమాలను విద్యా, వైద్య, శిశు సంక్షేమ శాఖలు అతి ముఖ్యమైనవని వీరంతా కలసి సమన్వయం తో పని చేసి సత్ఫలితాలు దిశగా జిల్లాను ముందుకు తీసుకు వెళ్ళాలని సూచించారు. ఈ నెల రోజులు పాటు 8వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా చక్కగా నిర్వహించిన జిల్లా సిబ్బంది కి మరియు అంగన్ వాడి కార్యకర్తలకు జిల్లా కలెక్టర్ వారిచే మొమెంటో లను అందించారు. ఆన%శీ%తరం కొంత మంది స్త్రీ లకు గర్భిని ఆహ్వానం శ్రీమంతం కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ వారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమం లో మొదటగా శిశు సంక్షేమ శాఖ వారు ఏర్పాటు చేసిన సేల్ఫీ పాయింట్ వద్ద ఫోటో తీసుకోని ఆనంతరం ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్స్ ను సందర్శించారు.ఈ కార్యక్రమం లో జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ పిడి హైమవతి, నగరపాలక సంస్థ కమిషనర్ రవి, ప్రభుత్వ ఆసుపత్రి గైనకాలజిస్ట్ కోటేశ్వరమ్మ, జి.సి.డి.వో మాధవి, అంగన్వాడి, ఆశా వర్కర్స్, తదితరులు పాల్గొన్నారు.అనంతరం కలెక్టరేట్లో పలు శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ జీఎస్టీ తగ్గింపు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. వాణిజ్య పన్నుల శాఖ ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలోని శివాలయం సర్కిల్ నుండి నేతాజీ సర్కిల్ (బంగ్లా) వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, టిడిపి నాయకుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, జిల్లా అధికారులు జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలు పాల్గొన్నాయి.

# బీసీ రిజర్వేషన్ బిల్లు పిటిషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు!

హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్




స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోపై దాఖలైన పిటిషన్?ను కొట్టివేసింది సుప్రీంకోర్టు.
హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ..తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్. సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు.
2025, అక్టోబర్ 16వ తేదీన ఈ పిటీషన్?పై విచారణ చేసిన సుప్రీంకోర్టు దాన్ని డిస్మస్ చేసింది. హైకోర్టులో కేసు పెండింగ్?లో ఉన్నందునా పిటిషన్?ను విచారణకు స్వీకరించలేమని స్పష్టం చేసింది. పాత రిజర్వేషన్లపై ఎన్నికలకు వెళ్లవచ్చని పేర్కొంది. హైకోర్టులో తదుపరి విచారణ కొనసాగుతుందని స్పష్టం చేసింది.
లోకల్ బాడీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 9ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ జీవోపై తెలంగాణ హైకోర్టు స్టే విధించింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2025, అక్టోబర్ 13న అర్ధరాత్రి సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేసింది.
ఈ పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన బెంచ్ గురువారం అక్టోబర్ 16, విచారణ చేపట్టింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే ప్రక్రియ పూర్తిగా చట్టబద్ధంగా, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు తగ్గట్టుగా శాస్త్రీయంగా జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం తరుపున సీనియర్ లాయర్ అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు.
కులగణన సర్వేలో బీసీల జనాభా 57.6 శాతం ఉన్నట్టు తేలిందని, దాని ఆధారంగా 42% రిజర్వేషన్లు కల్పించాలని కమిషన్ సిఫార్సులు చేసిందని.. బీసీ కమిషన్ సిఫార్సుల మేరకే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించామని కోర్టుకు తెలిపారు.
ఇరువర్గాల వాదనలు విన్న ధర్మాసనం.. తెలంగాణ ప్రభుత్వ వాదనలతో ఏకీభవించకుండా పిటిషన్?ను కొట్టివేసింది. హైకోర్టులో కేసు పెండింగ్?లో ఉన్నందునా పిటిషన్?ను విచారణకు స్వీకరించలేమని.. అక్కడే తేల్చుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. పాత రిజర్వేషన్లపై ఎన్నికలకు వెళ్లవచ్చని పేర్కొంది. హైకోర్టులో తదుపరి విచారణ కొనసాగుతుందని స్పష్టం చేసింది.

# కాంగ్రెస్ అరాచక పాలనతో రాష్ట్రం అధోగతి.కె.సి.ఆర్ 10ఏండ్ల ప్రజా పాలన

ఉదయం న్యూస్ వనపర్తి.



రేవంత్ రెడ్డిది రెండేళ్ల విధ్వంసక పాలన.మాగంటి.సునీత గెలుపు పక్కా .రహ్మత్ నగర్ డివిజన్లో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రచారంకె.సి.ఆర్ కి తగ్గని ప్రజాఆదరణ. ప్రజలకు అండగా నిలిచిన మాగంటి.గోపీనాథ్ భార్య మాగంటి.సునీతను ఆదరించి ఆశీర్వదించాలని జూబ్లిహిల్స్ ప్రజలన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కోరారు. ఈరోజు రహ్మత్ నగర్ డివిజన్లో హనుమాన్ దేవాలయం నందు పూజలు నిర్వహించిన అనంతరం వనపర్తి నాయకులతో కలసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ పార్టీ విఫలమైన కాంగ్రెస్ పార్టీకి ఓట్లు అడిగే నైతిక హక్కులేదని ఘాటుగా విమర్శించారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆడబిడ్డను అవమానకరంగా మాట్లాడిన మంత్రులు మహిళలకు క్షేమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.
జూబ్లిహిల్స్ తో పాటు హైదరాబాద్ నగరాని అభివృద్ధి చేసిన కె.సి.ఆర్ బలపరిచిన సునితమ్మను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.గౌరవ నిరంజన్ రెడ్డి గారి వెంట గట్టు యాదవ్,విజయ్ కుమార్ ,నందిమల్ల అశోక్,పలుస.రమేష్ గౌడ్,గంధం.పరంజ్యోతి,బోర్ల.భీమన్న,ఉంగ్లం. తిరుమల్,బండారు.కృష్ణ,ప్రేమ్ నాథ్ రెడ్డి,స్టార్.రహీమ్,దేవర్ల.నరసింహ, జోహెబ్ హుస్సేన్,చిట్యాల.రాము, హేమంత్ ముదిరాజ్,సునీల్ వాల్మీకి,మంద.రాము, అనపటి.రాము,డాక్టర్.డ్యానియల్ ,అలీమ్ తదితరులు ఉన్నారు

## ఏపీ రాష్ట్ర గౌడ కార్పొరేటర్ చైర్మన్ గురుమూర్తి గౌడ్ శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేసి ఘనంగా సన్మానం చేసిన గౌడ సంఘం నాయకులు.

ఆత్మకూరు ఉదయం న్యూస్ ప్రతినిధి



పాములపాడు:- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్- గురుమూర్తి గౌడ్ నీ, రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్-కె.వెంకటేశ్వర్లు యాదవ్, నియోజకవర్గం పరిశీలకుడు దేవల్ల.మురళి లను రాష్ట్ర గౌడ సంఘ నాయకులు %ఃడ% టిడిపి బీసీ సెల్ పాములపాడు మండల అధ్యక్షుడు కంభం.మోహన్ గౌడు, బీసీ ఐక్య సంఘం అధ్యక్షుడు గట్టు.శంకర్ గౌడ్, నాయకులు మింగి.శ్రీనివాస గౌడ్, ఆగస్యల. విజయకుమార్, భాష్యం లక్ష గౌడు, యాసగోని.మహేష్ గౌడు, తూడిచెర్ల నాగేంద్ర గౌడ్, చంద్రశేఖర్ గౌడ్ లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు కప్పి, పూల బొకేలు చేతికి అందించి ఘనంగా సన్మానం చేయడం జరిగింది.
ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గౌడ సంఘం చైర్మన్ గా గురుమూర్తి గౌడ్ ఎంపిక అయినందుకు ఆయనకు పాములపాడు మండల టిడిపి బీసీ సెల్ అధ్యక్షుడు- కంభం.మోహన్ గౌడ్, బిసి ఐక్య సంఘం అధ్యక్షుడు గట్టు.శంకర్ గౌడ్, మింజీ.శ్రీనివాసులు గౌడ్, అగస్యల విజయకుమార్ గౌడ్, భాష్యం లక్ష గౌడ్, యాసగోని.మహేష్ గౌడ్ తూడిచెర్ల నాగేంద్ర గౌడ్, చంద్రశేఖర్ గౌడ్ లు శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు.

ఉదయం న్యూస్
ఎడిటర్ : సి. శేఖర్ యం





# ఏఎస్సైలు విధుల్లో సమర్థవంతంగా వ్యవహరించే విధానంపై ఏఎస్ఐలకు మార్గదర్శనం చేసిన జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, ఐపీఎస్.,

**ఉదయం న్యూస్ వనపర్తి**

సంక్లిష్ట కేసులను చేదించిన ఏఎస్సైల సేవలకు ఎస్పీ అభినపోలీసు విధుల్లో నిబద్ధతతో పాటు ఆరోగ్య పరిరక్షణ అవసరంలి ఏఎస్సైలకు సేవా నిబద్ధత, క్రమశిక్షణ, ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించిన ఎస్పీ గురువారం రోజు వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయం సమావేశం భవనంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్.,లి జిల్లాలోని అన్ని పోలీస్టేషన్ల ఏఎస్సైలకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించి. ఈ శిక్షణలో ఏఎస్సైలు విధుల్లో సమర్థత, న్యాయపరమైన దృక్పథం, ప్రజా సేవలో బాధ్యతలపై విస్తృతంగా అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ... ఏఎస్సైలు పోలీసు వ్యవస్థలో కీలక స్తంభాలు. మీ నిబద్ధత, సమయపాలన, నిజాయితీ పోలీస్టేషన్ సమర్థతను నిర్ణయిస్తాయని. ప్రజలతో మృదువుగా, పారదర్శకంగా వ్యవహరించి న్యాయ విశ్వాసాన్ని మరింత బలపరచి కేసుల దర్యాప్తులో వేగం, నిష్పాక్షికత, సాక్ష్యాధారాల ఆధారిత దృష్టి ఉంచి ఏఎస్ఐ క్రైమ్ రిజిస్టర్, %ఖీ×=%లు, పంచనామాలు, సాక్షుల విచారణ వంటి బాధ్యతలను సమర్థంగా నిర్వహించి. స్టేషన్ పరిపాలనలో ఎస్సైకి సహకరించి, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలతో సమన్వయాన్ని పెంపొందించుకొని కఠినమైన కేసులను సవాలుగా స్వీకరించి కేసులను పరిష్కరించి ప్రజల భద్రత, న్యాయసేవలో మీరు ఆదర్శంగా నిలువాలని కఠినమైన కేసులను సవాలు గా స్వీకరించి, చాకచక్యంగా పరిష్కరించిన,వారి కృషి, విశ్లేషణా సామర్థ్యం, నిబద్ధత పోలీసు శాఖకు గర్వకారణం,"అని ప్రశంసించారుఅంతేకాదు, ఆరోగ్య పరిరక్షణ కూడా అంతే ముఖ్యం. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటేనే విధుల్లో సమర్థత పెరుగుతుంది. నిత్యవ్యాయామం, సమతుల ఆహారం, సానుకూల దృక్పథంతో సేవను కొనసాగించండి," అని ఎస్పీ గారు సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పీ, ఉమామహేశ్వరరావు, డిసిఆర్బి ఎస్సై, తిరుపతిరెడ్డి అన్ని పోలీస్టేషన్ల ఏఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తున్న తండ్రి,కొడుకులు

**అమెరికా నుండి నాడు చంద్రబాబు మైక్రోసాఫ్ట్ తెస్తే,నేడు లోకేష్ గూగుల్ ను తెచ్చారు**

**బద్వేలు ఉదయం ప్రతినిధి**



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఆయన కుమారుడు నారా లోకేష్ బాబులు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి అన్నారు. గురువారం అయన బద్వేల్ లో మీడియాతో మాట్లాడుతూ నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు అమెరికా నుండి మైక్రోసాఫ్ట్ కంపెనీని హైదరాబాదుకు తీసుకురాగా,నేడు ఆయన కుమారుడు రాష్ట్ర ఐటీ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాబు అమెరికా నుండి గూగుల్ కంపెనీని విశాఖపట్నం తీసుకొచ్చి సువర్ణాక్షరాలతో లిఖించిన చరిత్రను మళ్లీ తిరిగి రాశారన్నారు. తండ్రి కొడుకులు ఇద్దరూ ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్తు కోసం రాత్రింబవళ్లు కష్టపడుతున్నారని చెప్పారు. గూగుల్ కంపెనీతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం చరిత్రలో ఒక మైలురాయి అని ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబు,విద్య శాఖ మంత్రి లోకేష్ బాబులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నారన్నారు. గూగుల్ స్థాపించిన ఆసియాలోనే పెద్ద ఏఐ డేటా సెంటర్ ను విశాఖ పట్టణానికి తీసుకువచ్చిన కృషిలో తండ్రికి తగ్గ కొడుకుగా కాకుండా తండ్రిని మించిన గొప్ప కొడుకుగా నారా లోకేష్ బాబు చరిత్ర సృష్టించారన్నారు. ఏపీ ప్రభుత్వం గూగుల్ తో చేసుకున్న ఎంఓయు ఒక చరిత్రాత్మకమని,గూగుల్ డేటా సెంటర్ విశాఖలో కార్యక్రమాలు ఆరంభిస్తే భారత దేశంలో ఏఐ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందుతుందని తెలిపారు. సీఎం చంద్రబాబు దిశానిర్దేశంలో మంత్రి నారా లోకేష్ బాబు ఆ విశ్రాంత కృషితో కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో ఆంధ్ర ప్రదేశ్ కి గూగుల్,టిసిఎస్,ఎ సెంచర్ వంటి ప్రపంచ స్థాయి కంపెనీలన్నీ కూడా ఆంధ్ర రాష్ట్రానికి రావడానికి తండ్రి కొడుకుల కృషి ఎంతో ఉందన్నారు. ఏఐ డేటా సెంటర్ పూర్తయితే మొదటి సంవత్సరంలో 1 లక్ష 80 వేల మందికి ఉద్యోగ,ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,గూగుల్ సంస్థల మధ్య ఆసియా ఖండంలోనే మొట్ట మొదటి సారిగా గిగా వాట్ హైపర్స్కిల్ డేటా సెంటర్ స్థాపించడం వల్ల ఇది రాష్ట్ర ఐటీ రంగానికి గణనీయమైన బలాన్ని ఇస్తుందన్నారు.

# బద్వేలు లో సూపర్ జీఎస్టీ పై ఆర్టీవో అధికారుల అవగాహన బైక్ ర్యాలీ.

**బద్వేలు ఉదయం ప్రతినిధి**



సిద్దవటం రోడ్డులోని ఆర్టీవో కార్యాలయం వద్ద నుండి ప్రధాన రహదారుల వెంబడి కొనసాగిన ర్యాలీ...జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన ఎంవిఐ శేఖర్ రావు, బద్వేల్ అర్బన్ సిఐ లింగప్ప...ఈ కార్యక్రమంలో ఏ సిటీవో విజయలక్ష్మి , డి సి టి ఓ ,శ్రీనివాసులు, ప్రవీణ్ కుమార్ పట్టణంలోని డ్రైవింగ్ స్కూల్ బైక్ షోరూం షోరూంలా యాజమాన్యం సిబ్బంది పాల్గొన్నారు.. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ,మరియు సచివాలయ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు...

# ప్రధాని మోడీకి ఘన స్వాగతం పలికిన మంత్రులు

**కొలిమిగుండ్ల అక్టోబర్ 16 (ఉదయం న్యూస్):**



కర్నూలు జిల్లా నన్నూరు బహిరంగ సభ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ కి చేరుకున్న గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గారికి స్వాగతం పలుకుతున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ , రాష్ట్ర రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మాత్యులు బి.సి.జనార్ధన్ రెడ్డి , రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి యన్ ఎం డి ఫరూక్ , కేంద్ర మంత్రి కింజరాపు రామ్ మోహన్ నాయుడు, భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎం.పి.నాగరాజు తదితరులులి

# ఇండియన్ లిటరసీ ప్రాజెక్ట్ సందర్శించిన నాలెడ్జ్ హబ్ మేనేజర్ రవిమణి .

**ఉదయం న్యూస్ వనపర్తి**





ఇండియా లిటరసీ ప్రాజెక్ట్ బెంగళూరు వారి సహకారంతో వనపర్తి జిల్లాలో రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలోనిర్వహిస్తున్న ప్రోగ్రాంలో భాగంగా నాలెడ్జ్ ఆఫ్ మేనేజర్ రవిమణి రెండు రోజులు అంగన్వాడి సెంటర్స్, సైన్స్ కిట్స్ ,కంప్యూటర్ హబ్ ఐసిటి, చైల్డ్ క్లబ్, కెరియర్ గైడెన్స్, హెల్ప్ డిస్కవరీ వాటిని గురించి వనపర్తి, పెబ్బేర్ ,సూగుర్, ఆమడబాకుల సెంటర్స్ ని సందర్శించడం జరిగింది. దీనిలో భాగంగా మాడల్ అంగన్వాడీలో ప్రీస్కూల్ యాక్టివిటీ, ప్రికాస్ట్, లోకాస్ట్ మెటీరియల్ ఉపయోగిస్తూ పిల్లలకు యాక్టివిటీస్ నేర్పించడం, ఆటపాటలతో విద్య పనితీరును పరిశీలించడం జరిగింది. సైన్స్ కిట్టు లో విద్యార్థులకు సైన్స్ ప్రయోగాలు టీచర్స్ కి ఇచ్చిన ట్రైనింగ్ పిల్లలకు ఎంతవరకు అర్థవంతంగా చెబుతున్నారో సైన్స్ కిట్టుల యొక్క ఉపయోగాలు ఏ విధంగా ఉన్నాయో చూడడం జరిగింది. %జశీఎజూఙవతీ ఙఖదీ ×జు% లో భాగంగా కంప్యూటర్ బేసిక్స్, కంప్యూటర్ ని ఉపయోగించి పుస్తకంలో ఉన్న సారాంశాన్ని కంప్యూటర్లో డ్రాయింగ్ రూపంలో సులభంగా అర్థమయ్యే విధంగా ఉపయోగించిన విధానాన్ని పరిశీలించడం జరిగింది. ఈ సందర్భనలో భాగంగా రూరల్ డెవలప్మెంట్ సొసైటీ వనపర్తి జిల్లా ప్రెసిడెంట్ చిన్నమ్మ థామస్ మాట్లాడుతూ ఐ ఎల్ పి ప్రోగ్రాం వలన వనపర్తి జిల్లాలో చాలావరకు పాఠశాలలు అంగన్వాడీలు ఉండే పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుంది అని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐ ఎల్ పి ప్రోగ్రాం డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ మీనా థామస్, ఐ ఎల్ పి స్టాఫ్ శ్రీలక్ష్మి, అరుణ, జ్యోతి,కల్పన, రమాదేవి, రామకృష్ణ, మొగులయ్య, కరిష్మా, అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, పాల్గొనడం

# జాయింట్ కలెక్టర్ డా. అభిషేక్ గౌడ్‌కు ఘన వీడ్కోలు

**అంకితభావంతో విధులు నిర్వహించి మెరుగైన పాలన అందించారు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్**

**ఉదయం న్యూస్ అల్లూరి జిల్లా పాడేరు, అక్టోబర్ 16**



: అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో గురువారం జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్‌కు హృదయపూర్వక వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం ఆయన సేవలను కొనియాడింది. జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ మాట్లాడుతూ, జాయింట్ కలెక్టర్‌గా ఒక సంవత్సరం, పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారిగా ఏడు నెలలు రెండు పదవులను ఒకేసారి నిర్వహించిన డాక్టర్ అభిషేక్ గౌడ్ అనుభవం భవిష్యత్తులో ప్రజలకు మరింత సమర్థవంతమైన పాలన అందించడానికి ఉపయోగపడుతుందని అన్నారు. నర్సీపట్నం నియోజకవర్గం, కోటవురట్ల మండలంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన 89 మంది పిల్లల ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరచడానికి ఆయన అహోరాత్రులు అంకితభావంతో యుద్ధ ప్రాతిపదికన కృషి చేశారని గుర్తు చేశారు. ఇటువంటి సమర్థవంతమైన అధికారులను జిల్లాకు కేటాయించినందుకు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పర్యటనలు, ఆరుకు చలి వత్సవం, 108 సూర్య నమస్కారాలు వంటి పెద్ద కార్యక్రమాలను జాయింట్ కలెక్టర్ సహకారంతో విజయవంతం చేయగలిగామని అన్నారు. జిల్లాకు తలమానికమైన కాఫీ పంటకు బెర్రీ బోరర్ అనే తెగులు సోకినప్పుడు నష్ట నివారణ చర్యలు చేపట్టడానికి విశేష కృషి చేశారని కొనియాడారు. మంచి అభ్యాసకుడు, సమర్థవంతమైన పనితీరు గల వారితో కలిసి పనిచేయడం సంతోషంగా ఉందని కలెక్టర్ తెలిపారు. ఐటీడీఏ పీవో తిరుమణి శ్రీ పూజ మాట్లాడుతూ, జాయింట్ కలెక్టర్ ఏదైనా ఒక విషయంపై పూర్తిస్థాయిలో అవగాహన తెలుసుకునే వరకు వదిలిపెట్టే వారు కాదని, ఆయన గొప్ప మార్గదర్శకత్వం మరియు అపారమైన సహాయం అందించారని కొనియాడారు. అసిస్టెంట్ కలెక్టర్ కే. సాహిత్ మాట్లాడుతూ, శిక్షణ తర్వాత ఏఎస్ఆర్ జిల్లాకు పోస్టింగ్ వచ్చినప్పుడు టెన్షన్ పడ్డానని, కానీ సీనియార్టీతో సంబంధం లేకుండా స్నేహపూర్వక వాతావరణంలో జాయింట్ కలెక్టర్ వారితో పనిచేయడం ఆనందాన్ని ఇచ్చిందని తెలిపారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్ మాట్లాడుతూ, జిల్లా యంత్రాంగంతో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని, ఆకాంక్ష జిల్లా అయిన అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేయడం వల్ల చాలా నేర్చుకున్నానని అన్నారు. పాలనాపరంగా సహాయ సహకారాలు అందించిన జిల్లా యంత్రాంగానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.
అనంతరం జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్, ఇన్చార్జి జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ పి.వి. సందీప్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ కే. సాహిత్, జిల్లా రెవెన్యూ అధికారి కె. పద్మలతతో పాటు పలువురు జిల్లా అధికారులు జాయింట్ కలెక్టర్‌ను శాలువాతో సన్మానించి జ్ఞాపికలు అందించారు.

# తెలంగాణ బంద్‌కు బీఆర్ఎస్ మద్దతు!

**హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్**



తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన లక్ష్యంగా బీసీ సంఘాలు జరపనున్న రాష్ట్ర బంద్‌కు బీఆర్ఎస్ మద్దతిచ్చింది. వివరాలు:
అక్టోబర్ 18న బీసీ సంఘాలు జరపనున్న బంద్‌కు మద్దతు కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బీసీ సంఘాల నేతలు, రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణయ్య కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ. జాతీయ స్థాయిలో ఓబీసీ సంక్షేమ శాఖ ఉండాలని కోరిన ఏకైక తొలి నాయకుడు కేసీఆర్ అని అన్నారు. బీసీ రిజర్వేషన్లపైన తమ పార్టీ విధానాన్ని చాలా స్పష్టంగా తాము చెప్పామని తెలిపారు. గతంలో శాసనసభలో రెండుసార్లు రిజర్వేషన్ల కోసం తీర్మానం చేసి పంపించిందని చెప్పారు. కానీ కాంగ్రెస్ పార్టీ లెక్క ప్రచారం చేసుకోలేదని విమర్శించారు.
కామారెడ్డి డిక్లరేషన్‌లో భాగంగా రిజర్వేషన్లు పెడతామని శాసనసభలో చెప్పినప్పుడు తాము కాంగ్రెస్ పార్టీ తరఫున మద్దతు ఇచ్చామని తెలిపారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన అంశంలో కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తున్న తీరు మంచిది కాదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్లపైన ఐదు రకాలుగా మాట్లాడుతోందని విమర్శించారు. రాజ్యాంగ సవరణ ద్వారా, పార్టీ తరఫున రిజర్వేషన్లు ఇస్తామని, ఆర్డినెన్స్ ద్వారా, బిల్లు ద్వారా, మరోసారి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయిన తర్వాతనే బీసీ రిజర్వేషన్లు వస్తాయని చెబుతుందని మండిపడ్డారు. ఇన్ని రకాలుగా మాటలు మార్చిన కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధిని తాము తప్పకుండా ప్రశ్నిస్తూనే ఉంటామని అన్నారు. బీసీ రిజర్వేషన్లకు తమ పార్టీ సంపూర్ణంగా మద్దతు ఇచ్చిందని చెప్పారు. తప్పులు చేసిన కాంగ్రెస్ పార్టీని ఖచ్చితంగా త పార్టీ తరఫున నిలదీస్తూనే ఉంటామని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీసీ సంఘాల ప్రతి ప్రయత్నాన్ని తమ పార్టీ తరఫున సపోర్ట్ చేస్తామని అన్నారు. బీసీ రిజర్వేషన్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నన్ని రోజులు, ఆయన నాయకత్వంలో రానే రావని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి బలహీన వర్గాలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేదాకా నిలదీస్తూనే ఉంటామని అన్నారు. బీసీ డిక్లరేషన్లు ఇస్తామని చెప్పిన లక్ష కోట్ల రూపాయల బడ్జెట్ నుంచి మొదలుకొని బీసీ సబ్‌ప్లాన్ వంటి హామీలపైన నిలదీస్తూనే ఉంటామని అన్నారు. కాంగ్రెస్ తెచ్చిన 42 శాతంరిజర్వేషన్ కేవలం స్థానిక సంస్థల కోసం తీసుకువచ్చారు కానీ, విద్య, ఉపాధికి సంబంధించిన రిజర్వేషన్ల వాటా మిగిలిన అన్ని రంగాల్లో రావాల్సిన అవసరం ఉందని అన్నారు. కాంట్రాక్టులనుంచి మొదలుకొని అన్నింటికి సంబంధించిన వాటిలో 42 శాతం వాటా రావాలి అని బీసీ సమాజం డిమాండ్ చేయాలని సూచించారు.
కాంగ్రెస్ పార్టీ చేతిలో ఉన్నటువంటి కార్యక్రమాల అమలుపైన మనం నిలదీయాల్సిన అవసరం ఉందని అన్నారు. బీసీ సంఘాలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నిటి పైన నిలదీయాలని విజ్ఞప్తి చేస్తున్నానని పేర్కొన్నారు.
రాహుల్ గాంధీ, మోదీ ఇద్దరు కలిసి ఒక్క మాట అంటే ఒక్క నిమిషంలో బీసీ రిజర్వేషన్ల అంశం తేలిపోతుందని అన్నారు. ఇండి కూటమి, ఎన్డీయే రెండు కూటములు కలిస్తే బీసీ రిజర్వేషన్ బిల్లు వెంటనే చట్టంగా మారుతుందని చెప్పుకొచ్చారు. తెలంగాణ ఉద్యమం మాదిరే, సమస్యను ఢిల్లీ దాకా తీసుకువెళ్లి తెలంగాణ సాధించుకున్నట్లుగానే బీసీ రిజర్వేషన్లను సాధించుకుందామని పిలుపునిచ్చారు. అక్టోబర్ 18వ తేదీన బీసీ సంఘాలు నిర్వహించే బంద్‌కు బీఆర్ఎస్ పార్టీ మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు.

# మెటా ఫండ్ పేరుతో ఆన్‌లైన్ కాయిన్ మోసం కింగ్‌పిన్ అరెస్ట్

**సుమారు రూ. 25 నుండి 30 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టి మోసపోయిన బాధితులు?**

**కరీంనగర్ ప్రతినిధి, ఉదయం న్యూస్**




ఆన్‌లైన్‌లో మెటా ఫండ్ అనే నకిలీ కాయిన్ యాప్‌ను సృష్టించి, అధిక లాభాల ఆశ చూపి ప్రజల నుండి సుమారు రూ. 25 కోట్ల నుండి 30 కోట్ల వరకు పెట్టుబడులు వసూలు చేసి మోసం చేసిన కేసులో ప్రధాన నిందితుడు వరాల లోకేశ్వర్‌రావు మల్కాజ్‌గిరి, హైదరాబాద్ నివాసి ను కరీంనగర్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు.
సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌ల తయారీలో నైపుణ్యం కలిగిన లోకేశ్వర్‌రావు, కరీంనగర్‌కు చెందిన తులసి ప్రకాష్, బూర శ్రీధర్, దాసరి రాజు, దాసరి రమేష్, కట్ల సతీష్ లతో కలిసి ఈ మోసానికి ప్రణాళిక రచించారు. మోసం వివరాలులోకేశ్వర్‌రావు నకిలీ మెటా ఫండ్ ఆన్‌లైన్ యాప్‌ను, కాయిన్లను సృష్టించారు.
రూ. 90,000 పెట్టుబడికి 1,000 కాయిన్లు ఇస్తామని, నెల రోజుల్లో మూడు రెట్లు లాభంతో అమ్ముకోవచ్చని ప్రజలను నమ్మించారు.
బాధితులను నమ్మించడానికి రిసార్ట్‌లు, గోవా, విదేశీ ట్రిప్‌లకు తీసుకెళ్లి ప్రలోభాలకు గురిచేశారు.
బాధితుల నుండి డబ్బును నగదు రూపంలో తీసుకుని, కేవలం ఆన్‌లైన్‌లో నకిలీ ఐడీలు, కాయిన్లను కేటాయించారు. డబ్బు విత్‌డ్రా చేయలేని విధంగా యాప్‌ను రూపొందించారు.
చివరికి యాప్‌ను ఆన్‌లైన్ నుండి తొలగించి ప్రజలను మోసం చేశారు.
దర్యాప్తు, అరెస్ట్‌లు:
కరీంనగర్ రూరల్ మరియు కరీంనగర్–%××% టౌన్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ప్రాథమిక దర్యాప్తులో తులసి ప్రకాష్, బూర శ్రీధర్, దాసరి రాజు, దాసరి రమేష్, కట్ల సతీష్‌లను గతంలోనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు.
దర్యాప్తులో భాగంగా ప్రధాన నిందితుడు వరాలు: లోకేశ్వర్‌రావును బుధవారం ఎల్.యం.డి. అలుగునూరు వద్ద అరెస్ట్ చేశారు.
నిందితుల వద్ద నుండి బాధితుల డబ్బుతో కొనుగోలు చేసిన ఆస్తుల పత్రాలు, 30 తులాల
బంగారం, మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లు, అలాగే ప్రధాన నిందితుడి వద్ద నుండి ఒక బి.ఎం.డబ్ల్యూ. కారు స్వాధీనం చేసుకున్నారు.
ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకుని ఛేదించిన పోలీస్ సిబ్బందిని కరీంనగర్ కమిషనర్ ఆఫ్ పోలీస్ అభినందించారు.

**ప్రజలకు విజ్ఞప్తి:**

ఆన్‌లైన్ ద్వారా అధిక లాభాలు వస్తాయని చెప్పి పెట్టుబడులు పెట్టమని ఎవరైనా చెబితే జాగ్రత్త వహించాలని, తప్పుదోవ పట్టించే యాప్‌లు లేదా అనుమానాస్పద పెట్టుబడి పథకాలలో డబ్బు పెట్టి మోసపోవద్దని కమిషనర్ ఆఫ్ పోలీస్, కరీంనగర్ జిల్లా పోలీస్ తెలియజేశారు. మోసాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే %ణఖశ్రీ–%100–1930 సైబర్ హెల్ప్‌లైన్, కు సమాచారం ఇవ్వగలరు.

# చలికాలంలో వర్కౌట్









చలికాలంలో వర్కౌట్ చేయడానికి అస్సలు వీలు కాదు. ముసుగు తన్ని పడుకోవాలనిపిస్తోంది. అలాంటప్పుడు ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకోండి. చలిలో ఈ ఎక్సర్‌సైజెస్ చేస్తే చాలా మంచిదట.. వర్కౌట్ చేయడం చాలా ముఖ్యం. ఏ కాలమైనా సరే కొంత వర్కౌట్ చేస్తే బాడీ యాక్టివ్‌గా ఉంటుంది. ముఖ్యంగా చలికాలంలో వర్కౌట్ గురించి ఎక్కువగా ఆలోచించరు. కానీ, ఈ టైమ్‌లో కూడా ఎక్సర్‌సైజ్ చేయాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. అవేంటో తెలుసుకోండి.

చిన్నారులలో ఉండే భయాలు, ఫోబియాలను పోగొట్టడం ఎలా?

నడక, పరుగు.. రన్నింగ్, వాకింగ్ అనేది ఆరోగ్యానికి హెల్ప్ చేసే వర్కౌట్స్, ఇవి గుండె ఆరోగ్యానికి చాలా మంచివి. చల్లని వాతావరణంలో నడవడం, పరుగెత్తడం వల్ల ఎక్కువ కేలరీలు ఖర్చవుతాయి. ఎందుకంటే, చల్లని గాలి మీ ఏకాగ్రత, ఒత్తిడిని తగ్గిస్తాయి. ఇవి రెండు బరువు తగ్గేందుకు హెల్ప్ చేస్తాయి.

పుష్కలంగా నీరు.. ఈ టైమ్‌లో చాలా మంది నీరు తాగరు. కానీ, ఏ టైమ్‌లో అయినా నీరు తాగాలి. దీంతో డీ హైడ్రేట్ అవ్వరు. హైడ్రేషన్ స్థాయిలను అదుపులో ఉంచుకోవాలి. లేకపోతే బాడీలో రక్త ప్రసరణ తగ్గి వేడి తగ్గుతుంది. మీరు డీహైడ్రేట్ అయినప్పుడు చర్మం పొడిగా మారడం, అలసట, తలనొప్పిగా ఉంటుంది.

సరైన బట్టలు.. ఈ టైమ్‌లో బాడీలో రక్త ప్రసరణ తగ్గి శరీరం బిగుసుకుపోతుంది. దీంతో వర్కౌట్ చేయడం కష్టమవుతోంది. అలా కాకుండా ఉండాలంటే బాడీని వెచ్చగా ఉండే బట్టలు వేసుకోండి. దీని వల్ల శరీరం చల్లబడదు. అలా అని ఎక్కువ బట్టలు వేసుకోకూడదు.

లంచ్ టైమ్‌లో.. సాధారణంగా మార్నింగ్ వర్కౌట్ చేస్తాం. కానీ, చలికాలంలో చేయలేం. అలాంటప్పుడు లంచ్ బ్రేక్‌లో చేయండి. దీని వల్ల శక్తితో తిరిగి పని చేయడానికి హెల్ప్ చేస్తుంది. దీనికోసం వాకింగ్, స్ట్రెచింగ్ వర్కౌట్స్ చేయొచ్చు. దీని వల్ల మానసిక సమస్యల, శారీరక బలం, ఫ్లెక్సిబిలిటీ పెరుగుతుంది. ప్రతిరోజూ వర్కౌట్ చేయడానికి కొన్ని యోగాసనాలు, ధ్యానం చేయొచ్చు.


స్ట్రెచెస్.. కచ్చితంగా స్ట్రెచెస్ చేయాలి. దీని వల్ల శరీరం వేడిగా మారి రక్త ప్రసరణ మెరుగ్గా మారుతుంది. కండరాలని సులువు చేసి పనితీరు మెరుగ్గా చేస్తుంది. దీని వల్ల కండరాల ఒత్తిడి, నొప్పి తగ్గి ఎలాంటి సమస్యలు లేకుండా అవుతాయి.

# రోజూ 7 గంటల కంటే తక్కువ సమయం నిద్రపోతే..

మనం ఆరోగ్యంగా ఉండటానికి.. ప్రశాంతమైన నిద్ర చాలా అవసరం. అందుకే.. ప్రతిరోజూ కనీసం 7 నుంచి 9 గంటలు నిద్రపోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అయితే.. ఫోన్‌ల వాడకం ఎక్కువవ్వడం, అయితే తీరిక లేని పనులు, నైట్ షిఫ్టులు, లైఫ్‌స్టైల్ మార్పులు కారణంగా చాలామంది నిద్రను నిర్లక్ష్యం చేస్తున్నారు. దీని ప్రభావం మన రోజువారీ పనులు, ఆరోగ్యంపై తీవ్రంగా ఉంటోందని నిపుణులు చెబుతున్నారు. రోజుకు 7 గంటలు కూడా ప్రశాంతంగా నిద్రపోకపోతే.. ఎలాంటి దుష్ప్రభావాలు ఎదురవుతాయో ఈ స్టోరీలో చూద్దాం.

7 గంటల నిద్ర ఎందుకు అవసరం.. రాత్రి పూట నిద్రపోతున్నప్పుడు.. మన శరీరం రిపేర్ మోడ్‌లోకి వెళ్తుంది. కణాలు రిపేర్ అవుతాయి, కండరాలు పునర్నిర్మించబడతాయి, మీరు రిఫ్రెష్ అవుతారు, రియాక్టివేట్ అవుతారు. అభిజ్ఞా పనితీరు మెరుగుపడటానికి, జ్ఞాపకశక్తి పెరగడానికి, ఆలోచనా శక్తి పెరగడానికి.. 7 నిద్ర కీలకం. 7 గంటల నిద్ర మెదడుకు పవర్ బూస్ట్ లాంటిది, మీరు అప్రమత్తంగా, ఏకాగ్రతతో ఉండేలా చూస్తుంది.







అలసట, ఉత్పాదక తగ్గుతుంది.. ఏడు గంటల కంటే తక్కువ నిద్రపోతే.. డీప్ స్లీప్, వివిధ స్లీప్ సైకిల్స్ గుండా వెళ్లడానికి తగినంత సమయం ఉండదు. ఫలితంగా, మీరు అలసటగా, గజిబిజిగా మేల్కొంటారు. దీంతో మీరు రోజంతా అలసటగా ఉంటారు. మీ రోజువారీ పనులలో ఏకాగ్రత, అప్రమత్త తగ్గుతుంది. మీ పనిలో ఉత్పాదకత తగ్గుతుంది. మీకు సరైన విశ్రాంతి లేకపోతే.. ఆలోచించడంలో స్పష్టత ఉండదు, సమస్యలను పరిష్కరించడం, సమర్థవంతంగా నిర్ణయాలు తీసుకునే మీ సామర్థ్యాన్ని దెబ్బతీస్తుంది.

బరువు పెరుగుతారు.. రాత్రిపూట 7 కంటే తక్కువ నిద్రపోతే.. బరువు పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే పడుకోకుండా ఉన్నప్పుడు శరీరం ఎక్కువ కేలరీలను వినియోగించుకుంటుంది. ఫలితంగా మనకు తెలియకుండా ఎక్కువ ఆహారం తీసుకుంటాం. ఇది అధిక బరువుకు దారి తీస్తుంది. నాలుగు గంటల కంటే తక్కువగా పడుకున్న వారిలో దాదాపు 10శాతం అనవసరపు కొవ్వులు పెరిగినట్లు ఓ అధ్యయనంలో తేలింది. కనీసం 7 నుంచి 9 గంటలపాటు నిద్రపోవాలని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ఇమ్యూనిటీ బలహీనపడుతుంది.. మీ రోగనిరోధక వ్యవస్థ ఉత్తమంగా పనిచేయడానికి ప్రశాంతమైన నిద్రపై ఆధారపడుతుంది. గాఢమైన నిద్రలో, మీ శరీరం సైటోకిన్‌లను ఉత్పత్తి చేస్తుంది, విడుదల చేస్తుంది. ఇవి ఇన్‌ఫెక్షన్లు, వాపులతో పోరాడటానికి తోడ్పడతాయి. మీరు 7 గంటల కంటే తక్కువ నిద్రపోతే.. రోగనిరోధక శక్తిని పెంచే ఈ సైటోకిన్‌లను ఉత్పత్తి చేసే సామర్థ్యం తగ్గుతుంది. ఇది మీ రోగనిరోధక రక్షణను బలహీనపరుస్తుంది. జలుబు, ఫ్లూ, ఇతర ఇన్ఫెక్షన్‌ల వంటి అనారోగ్యాలకు ముప్పు పెరుగుతుంది.

హార్మోన్ల అసమతుల్యత... శరీరానికి తగినంత విశ్రాంతి లభించకపోతే ఆ ప్రభావం హార్మోన్లపై పడుతుంది. మనం నిద్రపోతున్నప్పుడు కూడా శరీరంలోని అవయవాలన్నీ యాక్టివ్‌గా పనిచేస్తుంటాయి. ఆ సమయంలో శరీరంలోని అంతఃస్రావక వ్యవస్థ హార్మోన్లను నియంత్రిస్తుంటుంది. ఇందులో సంతానోత్పత్తికి కారణమయ్యే కీలకమైన ఈస్ట్రోజన్, ప్రొజెస్టిరాన్, హార్మోన్లు కూడా ఉంటాయి. నిద్రలేమి వల్ల ఈ హార్మోన్ల స్థాయిల్లో హెచ్చుతగ్గులు వస్తుంటాయి. ఫలితంగా సంతానలేమికి కారణమయ్యే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. వీటికి తోడు లైంగికాసక్తి తగ్గడం, మూడ్ స్వింగ్స్ వంటి సమస్యలు కూడా వస్తాయంటున్నారు.

# రక్తం తక్కువగా ఉందా..?




హిమోగ్లోబిన్ అనేది ఎర్ర రక్త కణాలలో ఉండే ప్రోటీన్, ఇది శరీరమంతా ఆక్సిజన్‌ను తీసుకువెళ్లడానికి కీలకపాత్ర పోషిస్తుంది. హిమోగ్లోబిన్‌ను తయారు చేయడానికి, కణాలకు హీమ్ అనే భాగాన్ని నిర్మించడానికి ఇనుము అవసరం. మీ డైట్‌లో సరిపడా ఐరన్ తీసుకోకపోతే.. శరీరం తగినంత ఎర్ర రక్త కణాలను ఉత్పత్తి చేయలేదు లేదా కణాలకు హిమోగ్లోబిన్ లోపిస్తుంది.

తక్కువ హిమోగ్లోబిన్ స్థాయిలు రక్తహీనతకు దారితీయవచ్చు, ఇది అలసట, బలహీనత, తల తిరిగినట్టు అనిపించటం, చర్మం పాలిపోవటం ఇతర ఆరోగ్య సమస్యలకు కారణమవుతుంది. ఐరన్ లోపాన్ని దూరం చేయాడానికి, హిమోగ్లోబిన్ లెవల్స్ పెంచడానికి.. ఐరన్ రిచ్ ఫుడ్స్ మీ డైట్‌లో చేర్చుకోండి











అలివ్ సీడ్స్.. వీడిని గార్డెన్ క్రెస్ సీడ్స్, హలీమ్ సీడ్స్ అని కూడా పిలుస్తుంటారు. ఐరన్ పవర్‌హౌస్ అని చెప్పొచ్చు. ఈ చిన్న విత్తనాల్లో.. నాన్ హీమ్ ఐరన్ సమృద్ధిగా ఉంటుంది. వంద గ్రాముల అలివ్ సీడ్స్‌లో దాదాపు 11 ఐరన్ ఉంటుంది. అలివ్ విత్తనాల్లో.. ఐరన్‌తో పాటు.. కాల్షియం, ఫోలిక్ యాసిడ్, విటమిన్ సి వంటి పోషకాలూ ఉంటాయి. ఫోలిక్ యాసిడ్ ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి తోడ్పడుతుంది, విటమిన్ సి ఐరన్ శోషణను పెంచుతుంది. మీరు సలాడ్, పెరుగు, స్మూతీస్‌లో అలివ్ సీడ్స్ యాడ్ చేసుకోవచ్చు.

దానిమ్మ.. ఎర్రగా నిగనిగలాడం దానిమ్మలో ఐరన్ కంటెంట్ అధికంగా ఉంటుంది. ఇది రోజూ తీసుకుంటే.. రక్తహీనత దూరం అవుతుంది. దానిమ్మలోని విటమిన్ సి కంటెంట్ ఇనుము శోషణను పెంపొందించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. దానిమ్మలో పొటాషియం, క్యాల్షి యం లాంటి ఖనిజాలతోపాటు ఫైబర్ తగినంత మొత్తంలో ఉంటుంది. అలాగే విటమిన్-సి, కె, బి, ఎ పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు మీ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పాలకూర.. పాలకూర.. ఒక క్లాసిక్ ఐరన్ రిచ్ ఫుడ్. పాలకూరలో ఎర్రరక్త కణాల ఉత్పత్తికి కీలక పాత్ర పోషించే.. ఫోలేట్, ఐరన్ శోషణను మెరుగుపరచడానికి సహాయపడే విటమిన్ సి కూడా అధికంగా ఉంటాయి. పాలకూరలో విటమిన్ ఏ, బి, సి, కె, మెగ్నీషియం వంటి పోషకాలూ అధికంగా ఉంటాయి. ఇవి మీ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. పాలక్ పనీర్, పాలక్ కార్న్, పాలక్ చాట్, పాలక్ సూప్, ఆమ్లెట్స్ ఇలా రకరకాల వంటకాలు చేసుకుని ఎంజాయ్ చేయండి. గుడ్లు.. గుడ్డు.. సంపూర్ణ ఆహారం. దీనిలో పోషకాలు అధికంగా ఉంటాయి. ఎగ్‌లో హేమ్ ఐరన్ సమృద్ధిగా ఉంటుంది. ఒక పెద్ద ఉడికించిన గుడ్డులో దాదాపు 1 ఇనుము ఉంటుంది. ఐరన్ లోపంతో బాధపడేవారు.. రోజూ ఓ గుడ్డు తీసుకుంటే.. ఆరోగ్యానికి మేలు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

కమల.. కమల పండులో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది. ఇది సిట్రస్ జాతికి చెందిన పండు, దీనిలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఇది మొక్కల ఆధారిత నాన్-హీమ్ ఐరన్ శోషణను పెంచుతుంది. ఐరన్-రిచ్ ఫుడ్స్‌తో కలిపి విటమిన్ సి-రిచ్ ఫుడ్స్ తీసుకుంటే.. శరీరం ఐరన్ సమర్థవంతంగా గ్రహిస్తుంది.



# దోసకాయలు ఇలా తింటే ఈజీగా బరువు తగ్గుతారట..

దోసకాయలు తింటే ఎన్నో లాభాలు ఉన్నాయి. అందులో ముఖ్యంగా బరువు తగ్గడం. దీని గురించి పూర్తి వివరాలు తెలుసుకోండి. బరువు తగ్గడానికి చాలా మంది వర్కౌట్ చేస్తుంటారు. డైట్ కూడా ఫాలో అవుతారు. అయితే, ఈజీగా బరువు తగ్గాలంటే కొన్ని డైట్ టిప్స్ ఫాలో అవ్వొచ్చు. అందులో సద్గురు ఇచ్చే ఓ మంచి టిప్ గురించి తెలుసుకోండి. దీని వల్ల మీరు ఎలాంటి ఇబ్బంది లేకుండా యోగిలా బరువు తగ్గొచ్చు. అందుకోసం ఆయన ఇచ్చే ఆయన ఇచ్చే డైట్ ఏంటో తెలుసుకుందాం.



బ్రేక్‌ఫాస్ట్.. సద్గురు జగ్గీ వాసుదేవ్ తాను కొన్ని రోజులుగా బరువుని మ్యానేజ్ చేసేందుకు ఓ బ్రేక్‌ఫాస్ట్ ఫాలో అవుతున్నారు. దీని వల్ల ఈజీగా బరువు తగ్గుతారని చెబుతున్నారు. ఈ బ్రేక్‌ఫాస్ట్ తింటే బరువు తగ్గడం మాత్రమే కాదు గుండె, ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. అందుకోసం ఏం తినాలంటే..

దోసకాయ.. దోసకాయలో ఎక్కువ నీటి కంటెంట్ ఉంటుంది. దీనిని ఉదయాన్నే తినడం వల్ల చాలా లాభాలు ఉన్నాయి. ఆరోగ్యానికి నీరు చాలా మంచిది. నీరు తాగడం కంటే ఇలా వాటర్ కంటెంట్ ఉన్న ఫుడ్స్ తినడం వల్ల లాభాలు ఉన్నాయి. దీని వల్ల స్థాయి బ్యాలెన్స్ అయి శరీరమంతా హైడ్రేటెడ్‌గా ఉంటుంది.



బరువు తగ్గేందుకు.. దోసకాయలో ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణక్రియని స్పీడప్ చేస్తుంది. అదే విధంగా కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి. ఇది బరువు తగ్గడానికి సాయపడుతుంది. సద్గురు ప్రకారం, దీనిని ఉదయాన్నే తింటే బరువు తగ్గుతారు.



ఎముకలు, గుండె ఆరోగ్యానికి.. దోసకాయలో విటమిన్ కె ఎక్కువగా ఉంటుంది. ఇది గట్ హెల్త్‌ని మెరుగ్గా ఉంచుతుంది. ఎముకల బలాన్ని పెంచుతుంది. క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యాన్నికాపాడుతుంది. ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్‌ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.

# శీతాకాలం జుట్టు పొడిబారదు..!



చలిగాలులు కారణంగా జుట్టు పొడిబారుతుంటుంది. దీని కారణంగా జుట్టు నిర్జీవంగా మారడం, చిట్లిపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. ఈ సీజన్‌లో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే.. జుట్టు పొడిబారకుండా జాగ్రత్తపడవచ్చు. శీతాకాలం ఉష్ణోగ్రతలు పడిపోవడం చలిగాలుల కారణంగా జుట్టు పొడిబారడం, నిర్జీవంగా మారడం, జుట్టు చిట్లిపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. ఇక పొడి జుట్టు ఉన్న వారి బాధైతే.. ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ సీజన్‌లో హెయిర్ కేర్ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం.

సరిపడా నీళ్లు తాగండి.. శీతాకాలంలో చాలామంది నీళ్లు ఎక్కువగా తాగరు. మీరూ ఇలా చేస్తుంటే.. పెద్ద తప్పు చేస్తునట్లు. ఈ కాలంలో తగినంత నీరు తాగడం చాలా ముఖ్యం. శరీరం హైడ్రేట్‌గా ఉండాటని కి, కణాలు, కణజాలాలలో ఆక్సిజన్ ప్రవాహాన్ని ప్రోత్సహించడానికి, జుట్టు హెల్తీగా ఉండాటనికి, హెయిర్ గ్రోత్‌ను ప్రోత్సహించడానికి సరిపడా నీళ్లు చాలా అవసరం. ఈ సీజన్‌లో జుట్టు పొడిబారకుండా రక్షించుకోవడానికి.. రోజుకు కనీసం 8 గ్లాసుల నీళ్లు తాగాలి.



సీజనల్ ఫుడ్స్ తినండి.. సీజనర్ దొరికే కూరగాయలు, పండ్లు మన రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి, మన శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. ఇవి జుట్టుకు కూడా పోషణ అందించి, ఆరోగ్యంగా ఉంచుతాయి. ఈ సీజన్‌లో దొరికే పండ్లు, కూరగాయలు కచ్చితంగా తీసుకోండి. వీటిలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్ మెండుగా ఉంటాయి. ఇవి జుట్టును ఆరోగ్యంగా ఉంచుతాయి.

వేయించిన ఆహారానికి దూరంగా ఉండండి.. చలికాలంలో వేడి బజ్జీలు, సమోసాలు ఎక్కువగా లాగించేస్తూ ఉంటారు. చలికాలం మీ జుట్టును ఆరోగ్యంగా ఉంచుకోవడానికి.. వేయించిన ఫుడ్స్‌కు దూరంగా ఉండండి. శీతాకాలం రుచికరమైన వంటకాలను ఆస్వాదించడం ఫర్వాలేదు. ఏదైనా మితంగా తీసుకుంటేనే ఆరోగ్యానికి మంచిదని గుర్తుంచుకోండి. ఏదైనా అధికంగా తీసుకోవడం వల్ల మానవ శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడి పెరుగుతుంది. చర్మం, జుట్టు కణాలకు రక్తం ఆక్సిజన్ సరఫరాకు ఆటంకం కలుగుతుంది. నూనె అప్లై చేయడం మర్చిపోవద్దు.. చలికాలంలో జుట్టుకు ఎంత తరచుగా నూనె పెడితే అంత మంచిది. ఇది జుట్టులోని తేమ శాతం ఎక్కువ సమయం నిలిచి ఉండటానికి సహాయపడుతుంది. ఇది జుట్టు పొడిబారకుండా రక్షిస్తుంది.

# 'సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్' బహిరంగ సభ

## కర్నూలులో..



**ఓర్వకల్లు విమానాశ్రయంలో ఘనస్వాగతం**

కర్నూలు: ఒకరోజు పర్యటన కోసం ప్రధాని నరేంద్ర మోదీ గురువారం కర్నూలులోని ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ తదితరులు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా బరువు బాగా తగ్గిపోయావంటూ మంత్రి నారా లోకేశ్‌తో ప్రధాని నరేంద్ర మోదీ సరదా వ్యాఖ్యలు చేశారు. లోకేశ్‌తో మోదీ మాట్లాడుతూ గతసారి చూసినప్పటికంటే ఇప్పుడు చాలా బరువు తగ్గావు. త్వరలోనే మీ నాన్నలా తయారవుతావని వ్యాఖ్యానించారు. ఇక్కడి నుంచి మోదీ హెలికాప్టర్‌లో సున్నిపెంట చేరుకున్నారు. హెలికాప్టర్‌లో మోడీ వెంట సిఎం చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ వెళ్లారు. రోడ్డుమార్గంలో శ్రీభ్రమరాంబ, మల్లికార్జున స్వామి దర్శనానికి వెళ్లారు. మధ్యాహ్నం శ్రీశైల మల్లన్న క్షేత్రంలో దర్శించుకున్నారు. అనంతరం అక్కడి నుంచి హెలికాప్టర్‌లో నన్నూరుకు చరుకున్నారు.

రాగమయూరి గ్రీన్ హిల్స్ వద్ద 'సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్' బహిరంగ సభకు హాజరయ్యారు.






















# డిజైనర్ మనీశ్ మల్హోత్రా ఇంట్లో దీపావళి వేడుకలు

సినీ ప్రముఖులతో పాటు నీతా అంబానీ హాజరు భారతీయులు అత్యంత ఘనంగా జరుపుకునే పండగల్లో దీపావళి ఒకటి. ప్రస్తుతం ఈ పండగకి వారం రోజులే సమయం ఉండటంతో దేశవ్యాప్తంగా సంబరాలు మొదలయ్యాయి. ప్రజలు తమ ఇళ్లను అందంగా అలంకరించుకోవడం ప్రారంభించేశారు. వెలుగుల పండగను తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో జరుపుకునేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. ఇక బాలీవుడ్ ఇండస్ట్రీలో దీపావళి సందడి వారం ముందే వచ్చేసింది. తారలు పార్టీలంటూ స్నేహితులు, కుటుంబ సభ్యులతో ఎంజాయ్ చేస్తున్నారు. తాజాగా ప్రముఖ డిజైనర్ మనీశ్ మల్హోత్రా తన ఇంట్లో.. స్నేహితులు, కుటుంబ సభ్యులకు దివాళి పార్టీ ఇచ్చారు. ఈ పార్టీకి పలువురు బీటౌన్ తారలు హాజరై సందడి చేశారు. కరీనా కపూర్ , హేమ మాలినీ, జెనీలియా, కరణ్ జోహార్, రేఖ, ప్రీతి జింటా, అనన్య పాండే, కృతి సనన్, కాజోల్, అదితిరావ్ హైదరి, వాణీ కపూర్, సొనాక్షి సిన్హా, జహీర్ ఇక్బాల్, మలైకా అరోరా, సారా అలీఖాన్, ఖుషీ కపూర్, సుహానా ఖాన్ తదితరులు పార్టీకి హాజరయ్యారు. భారత్‌లోనే అత్యంత సంపన్నుడు ముకేశ్ అంబానీ కుటుంబం కూడా ఈ పార్టీలో మెరిసింది. నీతా అంబానీ, రాధిక మర్చంట్ దివాళీ పార్టీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక దుస్తుల్లో అందరినీ ఆకర్షించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

# ఒక్క ముద్దు సన్నివేశం లేదు

తెలుసుకదా ట్రైలర్ విడుదలలో సిద్ధూ

సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా రూపొందిన రొమాంటిక్ డ్రామా మూవీ 'తెలుసు కదా' రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలు. కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. ఈ మూవీ అక్టోబరు 17న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు ఈ నేపథ్యంలో తాజాగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. అందులో టీమ్ పంచుకున్న విశేషాలివి. సిద్ధూతో రొమాంటిక్ సినిమా తీయాలనే ఆలోచన ఎలా వచ్చిందన్న ప్రశ్నకు ఈ కాన్సెప్ట్‌కు సిద్ధూ అయితేనే న్యాయం చేయగలరని అనిపించింది. ఈ సినిమా షూటింగ్ చాలా ఎంజాయ్ చేశాం అని దర్శకురాలు నీరజ కోన అన్నారు. మొదట చూపిన ప్రచార చిత్రాలకు ఇప్పుడు రిలీజ్ చేసిన వాటికి సంబంధం లేనట్లు ఉంది? కావాలనే అలాంటి పోస్టర్స్ రిలీజ్ చేశారా? అని అడగ్గా కావాలని చేసింది కాదు. సినిమా ప్రారంభించినప్పటి నుంచి ప్రచార చిత్రాలు విడుదల చేస్తూ వచ్చాంఅనిసిద్ధూ అన్నారు. షూటింగ్ చేసే క్రమంలో కొన్ని మార్పులు చేశాం. అందుకే అలా డిఫరెంట్‌గా ఉన్నాయి. ట్రైలర్‌తో కథను చెప్పాలని అనుకున్నాం. దీపావళికి పోటీ చాలా ఉంది. ఆ సమయంలోనే విడుదల చేయడం రిస్క్ అనిపించడం లేదా? అంటే.. రిస్క్ ఉన్నచోటే విజయం ఉంటుంది.





# శ్రీవారిని దర్శించుకున్న కృతిశెట్టి

వేరుగా వచ్చిన ఎన్టీఆర్ సతీమణి ప్రణతితిరుమల శ్రీవారిని సినీ నటి కృతి శెట్టి దర్శించుకున్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో స్వామివారి సేవలో ఆమె పాల్గొన్నారు. తితిదే అధికారులు ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను కృతి శెట్టికి అందజేశారు. అలాగే తిరుమల శ్రీవారిని జూనియర్ ఎన్టీఆర్ సతీమణి లక్ష్మీ ప్రణతి దర్శించుకున్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో నూతన వధూవరులు నార్నె నితిన్ దంపతులతో కలిసి స్వామివారి సేవలో ఆమె పాల్గొన్నారు. తితిదే అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను వారికి అందజేశారు.



# హిందీలో రీమేక్ కానున్న సంక్రాంతికి వస్తున్నాం

తెలుగు బ్లాక్‌బస్టర్ 'సంక్రాంతికి వస్తున్నాం' ఇప్పుడు బాలీవుడ్‌లో రీమేక్ కానుందంటూ నెట్టింట పలు వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. విక్టరీ వెంకటేష్, ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి ప్రధాన పాత్రల్లో అనీల్ రావిపూడి తెరకెకక్కించిన సంక్రాంతికి వస్తున్నాం చిత్రం గత సంక్రాంతి 2025 సందర్భంగా విడుదలై భారీ విజయాన్ని అందుకుంది . దిల్ రాజు నిర్మించిన ఈ సినిమా రూ.300 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లతో ఇండస్ట్రీ హిట్ గా నిలిచింది. ఈ క్రమంలో చిత్రాన్ని బాలీవుడ్‌లో రీమేక్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు దిల్ రాజు. బాలీవుడ్ రీమేక్ స్టార్ అక్షయ్ కుమార్‌తో సంప్రదింపులు కూడా చేస్తున్నట్టు టాక్ నడుస్తుంది. అక్షయ్ కుమార్ ఇప్పటికే 'భూల్ భులయ్యా 2', 'రౌడీ రాథోర్', 'లక్ష్మీ' వంటి దక్షిణాది రీమేక్‌లతో హిట్ ట్రాక్‌లో ఉన్నారు. అయితే ఇటీవల వరుస ఎ÷-లాపులతో అక్షయ్ కుమార్ కెరీర్ ఒడిదుడుకుల్లో సాగుతోంది.

# జై హనుమాన్‌పై రిషబ్ వ్యాఖ్యలు

**సినిమా ఆలస్యం కానుందన్న సంకేతాలు**

'కాంతార చాప్టర్ 1'తో మళ్లీ ఒక్కసారి బాక్సాఫీస్‌ను శాసించిన కన్నడ స్టార్ రిషబ్ శెట్టి, ఇప్పుడు తన తదుపరి చిత్రం 'జై హనుమాన్' గురించి చేసిన కామెంట్స్‌తో హాట్ టాపిక్ అయ్యాడు. ఇప్పటికే భారీ అంచనాలు ఉన్న ఈ ప్రాజెక్ట్ కోసం అభిమానులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే, రిషబ్ చేసిన తాజా వ్యాఖ్యలతో ఫ్యాన్స్ కాస్త నిరాశలో ఉన్నారు. 'కాంతార చాప్టర్ 1' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రిషబ్ శెట్టి, తన తదుపరి ప్రాజెక్టుల గురించి స్పందించారు. 'చాప్టర్ 1 తర్వాత నేను చేస్తున్న సినిమా 'జై హనుమాన్'. ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహిస్తారు. ఈ సినిమా 2026 జనవరిలో సెట్స్‌పైకి వెళ్తుంది. ఆ తర్వాత నా డైరెక్షన్‌లో మరో సినిమా ఉంటుంది, అది రెండేళ్లలో వస్తుంది' అని ఆయన వెల్లడించారు. ఈ కామెంట్స్ విన్న తర్వాత అభిమానులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఇప్పటికీ షూటింగ్ ప్రారంభం కాలేదా? 2026 జనవరి అంటే సినిమా రిలీజ్‌కు ఇంకెన్నాళ్లు? అంటూ




అభిమానులు సోషల్ మీడియాలో ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. గతంలో 'జై హనుమాన్' సినిమా నుంచి రిషబ్ శెట్టి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ అయినప్పుడు షూటింగ్ స్టార్ట్ అయిందన్న భావన అభిమానుల్లో ఏర్పడింది. కానీ ఆ ఫొటో కేవలం ఫోటోషూట్ మాత్రమేనని, అసలు షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందనే క్లారిటీ ఇప్పుడే వచ్చింది. 2026 జనవరిలో సెట్స్ పైకి వెళ్తే, పోస్ట్-ప్రొడక్షన్, గ్రాఫిక్స్, ప్రమోషన్స్ అన్నింటినీ కలుపుకుంటే ఈ సినిమా విడుదలకు కనీసం 2027 వరకు వేచి చూడాల్సి రావచ్చు అన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇదే గ్యాప్‌లో రిషబ్ శెట్టి దర్శకత్వం వహించే మరో ప్రాజెక్ట్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రం, 'హనుమాన్' సినిమా సీక్వెల్ కావడంతో ఇప్పటికే భారీ బజ్‌ను సొంతం చేసుకుంది. బాక్సాఫీస్ వద్ద పెద్ద విజయం సాధించిన 'హనుమాన్' తర్వాత ప్రేక్షకులలో 'జై హనుమాన్'పై భారీ అంచనాలున్నాయి.



# ఫ్లో మిస్ చేసే సాంగ్స్ కి కోట్లు ఖర్చు ఎందుకో..?

మిగతా భాషల సినిమాల్లో ఇది జరుగుతుందా అన్నది స్పష్టత లేదు అఫ్కోర్స్ జరుగుతున్నా కూడా అది ఎప్పుడో ఒకసారి అన్నట్టు ఉంది.ఫ్లో మిస్ చేసే సాంగ్స్ కి కోట్లు ఖర్చు ఎందుకో..?

మిగతా భాషల సినిమాల్లో ఇది జరుగుతుందా అన్నది స్పష్టత లేదు అఫ్కోర్స్ జరుగుతున్నా కూడా అది ఎప్పుడో ఒకసారి అన్నట్టు ఉంది. కానీ టాలీవుడ్ లో మాత్రం అది రిపీట్ అవుతూనే ఉంది. ఇంతకీ ఏంటి అదీ అంటే సినిమాలో కోట్లు ఖర్చు పెట్టి ఒక సాంగ్ చేయడం తీరా సినిమాలో చూస్తే ఆ సాంగ్ లేకుండా వదలడం. అదేంటి అంటే సినిమా ఫ్లో మిస్ అవుతుంది అందుకే సాంగ్ స్కిప్ చేశామంటున్నారు మేకర్స్. ఈమధ్య ఈ కామెంట్ మరీ రొటీన్ అయ్యింది. సినిమా ప్రమోషన్స్ కోసం ముందే ఆ సాంగ్ ని రిలీజ్ చేయడం కొంతమంది ఆడియన్స్ ఆ సాంగ్ నచ్చి దాని కోసమే సినిమాకు వెళ్లడం అది సినిమాలో లేదని తెలిసి డిజప్పాయింట్ అవ్వడం జరుగుతుంది.ఆ సాంగ్స్ వల్ల సినిమాకు నష్టం వస్తుందా..గేమ్ ఛేంజర్, కింగ్ డమ్ రీసెంట్ గా వచ్చిన మిరాయ్, ఓజీ సినిమాల్లో కూడా సినిమా ఫ్లోని బ్రేక్ చేస్తుందని భారీగా ఖర్చు పెట్టిన సాంగ్ ని సైతం పక్కన పెట్టారు. ఐతే ఆ సాంగ్స్ వల్ల సినిమాకు నష్టం వస్తుందా అని అనుకున్నారు కానీ ఆ సాంగ్ కోసమే



సినిమాకు వచ్చిన వాళ్లు ఉంటారన్న విషయాన్ని గుర్తించట్లేదు. హిట్టైతే ఆ సాంగ్స్ ని యాడ్ చేస్తున్నారు కానీ ఫ్లాపైతే మాత్రం లైట్ తీసుకుంటున్నారు.ప్రస్తుతం ప్రభాస్ రాజా సాబ్ సినిమా కోసం కూడా యూరప్ లో రెండు సాంగ్స్ షూట్ కి చిత్ర యూనిట్ వెళ్లారు. అక్కడ కాస్ట్ లీ లొకేషన్స్ లో భారీగా ఖర్చు చేసి మరీ ఆ సాంగ్ ని చేస్తున్నారట. ఐతే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన మిరాయ్ సినిమాలోనే వైబ్ ఉంది బేబీ సాంగ్ సినిమాలో స్కిప్ చేశారు. ఆ తర్వాత సినిమా సక్సెస్ అయిన వారానికి యాడ్ చేశారు. రాజా సాబ్ ఒక హర్రర్ థ్రిల్లర్ మూవీ.. ఆ సినిమాలో సాంగ్స్ అనేవి డిఫరెంట్ గా ప్లాన్ చేయాలి. ఈ విషయంలో మారుతి ఆలోచన ఏమో కానీ ఇప్పుడు ఇంత ఖర్చు పెట్టి తీసిన సాంగ్స్ సినిమాలో పెడతారా లేదా అన్న డౌట్ వస్తుంది.

# ఆనంద్ దేవరకొండ..తక్షకుడు

బేబి సినిమాతో సూపర్ హిట్టు కొట్టాడు ఆనంద్‌దేవరకొండ. ఆ తర్వాత వినోద్ అనంతోజ్ డైరెక్షన్‌లో నటించిన మిడిల్ క్లాస్ మెలోడీస్ బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ తెచ్చుకుంది. వినోద్ అనంతోజ్, ఆనంద్ దేవరకొండ కాంబోలో మరో సినిమా రాబోతుంది. ఈ ఇద్దరూ ఈ సారి విభిన్న కథాంశంతో వస్తున్నట్టు తాజాగా రిలీజ్ చేసిన పోస్టర్ చెబుతోంది. ఆనంద్ దేవరకొండ నటిస్తున్న నెట్‌ఫ్లిక్స్ ఒరిజినల్ సీరిస్ ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తూ టైటిల్, ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఇందులో ఆనంద్ దేవరకొండ నక్సలైట్‌గా కనిపించబోతున్నట్టు క్లారిటీ ఇచ్చేశారు మేకర్స్. వేటగాడి చరిత్రలో జింకలు దోషులు.. అనే క్యాప్షన్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ మూవీలో లాపతా లేడీస్ ఫేం నటాన్షి గోయెల్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రీమియర్ డేట్‌తోపాటు ఇతర వివరాలపై రానున్న రోజుల్లో క్లారిటీ ఇవ్వనుంది ఆనంద్ దేవరకొండ టీం. తిరుగుబాటు ప్రతీకార డ్రామా నేపథ్యంలో వచ్చే ఈ చిత్రంపై ఫస్ట్ లుక్‌తో అంచనాలు పెరిగిపోతున్నాయి. థియేటర్‌తో పాటు ఓటీటీలో విడుదలైన సినిమాలు కూడా ఆదరణ సొంతం చేసుకుంటోన్న విషయం తెలిసిందే. ఓటీటీ ట్రెండ్‌ను ఫాలో అవుతూ యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఇలా యాక్షన్ ఫిల్మ్‌తో ఓటీటీ ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన ప్రధాన పాత్రలో రానున్న చిత్రం 'తక్షకుడు'. నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదల కానుంది. వినోద్ దర్శకత్వంలో ఇది రూపొందుతోంది. 'వేటగాడి చరిత్రలో జింక పిల్లలే నేరస్థులు..' అంటూ ఓ పోస్టర్‌ను పంచుకున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించనున్నారు.

Printed, Edited by , Published and Owned by .M Chandrasekhar Address Plot No 12. Journalist. Colony .Near. B.T.R.Nagar. vaartha Office Back Side .KG Road. Kurnool. Andhra Pradesh .Pincode 518 001
Printed at Uttejitha printer's, KURNOOL. AP. Cell No. 9440140418, RNI APTEL/2008/24570 ,